“ మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 9-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 280 Issue: 280

09 ఏప్రిల్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:08 సూర్యాస్తమయం - సా. 6:27 తిథి సప్తమి రా. 9:18 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం మూల ఉ. 8:42 వరకు తరువాత పూర్వాషాఢ యోగం పరిఘ సా. 5:49 వరకు కరణం విష్టి ఉ. 8:12 వరకు బవ రా. 9:18 వరకు వర్జ్యం ఉ. 6:59 నుండి ఉ. 8:47 వరకు దుర్ముహూర్తం ఉ. 10:14 నుండి ఉ. 11:03 వరకు మ. 3:10 నుండి మ. 3:59 వరకు రాహుకాలం మ. 1:50 నుండి మ. 3:22 వరకు యమగండం ఉ. 6:08 నుండి ఉ. 7:40 వరకు గుళికకాలం ఉ. 9:13 నుండి ఉ. 10:45 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:32 నుండి తె. 5:20 వరకు అమృత ఘడియలు ఉ. 6:07 నుండి ఉ. 7:54 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:53 నుండి మ. 12:42 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana



## రసాయన ఎరువులకు 41,543 కోట్ల సబ్సిడీ

### రైతులకు కేంద్రం శుభవార్త.. కేంద్ర కేబినెట్‌లో కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: దేశ రైతులకు కేంద్ర ప్రభుత్వం ఊరటనిస్తూ ఒక భారీ ఆర్థిక ప్యాకేజీని ప్రకటించింది. అంతర్జాతీయ విపణిలో రసాయన ఎరువుల ధరలు ఆకాశాన్నంటుతున్నా, ఆ భారం సామాన్య రైతుపై పడకుండా ఉండేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఫాస్ఫాటిక్, పొటాసిక్ ఎరువుల కోసం సుమారు రూ. 41,543 కోట్ల భారీ తరువాయి 2 వ పేజీలో...

## వడ్డీ రేట్లు యథాతథం

### 5.25 శాతంగా రెపో రేటు.. ఆర్బీఐ కీలక నిర్ణయాలు

న్యూఢిల్లీ: వడ్డీ రేట్లపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన చేసింది. 3 రోజుల పాటు ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష సమావేశం జరగ్గా.. బుధవారం ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సమీక్ష నిర్ణయాల్ని వెల్లడించారు. మరోసారి కీలక వడ్డీ రేట్లను స్థిరంగానే ఉంచుతున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఆర్బీఐ రెపో రేటు 5.25 శాతంగా ఉంది. అంతకుముందు ఫిబ్రవరి సమీక్షలో కూడా ఆర్బీఐ వడ్డీ రేట్లను మార్చలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2026-27 లో ఇదే తొలి సమీక్ష. వడ్డీ రేట్లు తరువాయి 2 వ పేజీలో...



**ఫ్లాష్.. ఫ్లాష్..**

**హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసేసిన ఇరాన్**

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. అటు సీజ్ ఫైర్‌కు అంగీకరిస్తూనే, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా పరిగణించింది. లెబనాన్‌పై దాడులు ఆపాలని లేకపోతే హర్మూజ్ జలసంధిని మూసేస్తామని హెచ్చరించిన కాసేపటికే.. జలసంధిని మూసేస్తూ నిర్ణయం తీసుకుంది.

# పీస్..పీస్

## ఆగిన ఇరాన్-అమెరికా యుద్ధం

- ఇరుపక్షాలు 2 వారాల సీజ్ ఫైర్
- హర్మూజ్ తెరిచేందుకు ఇరాన్ ఓకే
- 10 షరతులకు అమెరికా ఆమోదం
- అమెరికా-ఇజ్రాయెల్‌పై గెలిచాం: ఇరాన్
- మేం గొప్ప విజయం సాధించాం: ట్రంప్

ఎట్టకేలకు ఇరాన్ అమెరికా యుద్ధం ఆగింది. విరామం రెండు వారాలు మాత్రమే అన్నప్పటికీ, పరిస్థితుల దృష్ట్యా ఈ యుద్ధం ముగిసినట్లే కనిపిస్తోంది. మొత్తం ఇరాన్ నాగరికతను తుడిచిపెట్టేస్తాను అని కొన్ని గంటల కింద చెప్పిన ట్రంప్, తాజాగా ఇరాన్ తో రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించాడు.

టెహ్రాన్/వాషింగ్టన్: సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. ఇరు పక్షాలు 2 వారాలపాటు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇరాన్ హర్మూజ్ జలసంధిని తెరవడానికి ఒప్పుకుందని ట్రంప్ తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసీం మునీర్‌కు థాంక్స్ చెప్పారు. ఇరాన్ 10 ప్రతిపాదనలు ప్రతిపాదించిందని, 2 వారాల సమయంలో దీన్ని ఫైనలైజ్ చేస్తామని, ఈ సమయం సరిపోతుందని వివరించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్ తక్షణమే హర్మూజ్ జలసంధిని తెరవడానికి ఒప్పుకుందని వెల్లడించారు. ఇరాన్ సైతం వెంటనే సోషల్ మీడియా ద్వారా రెండు వారాల కాల్పుల విరమణకు ఒప్పుకున్నట్టు తరువాయి 2 వ పేజీలో...

## 10 నిమిషాల్లో 100 దాడులు

### లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడి

### 89 మంది దుర్మరణం



జెరూసలేం: అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణ కుదిరిన కొద్ది గంటల్లోనే ఇజ్రాయెల్ లెబనాన్‌పై విరుచుకుపడింది. 10 నిమిషాల వ్యవధిలో 100 ఎయిర్ స్ట్రయిక్స్ చేసింది. ఈ దాడుల్లో 89 మంది మృతి చెందగా, 700 మందికి పైగా గాయపడ్డారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. దాడులు జరిగిన ప్రాంతాల్లో అంబులెన్సులు, వైద్య సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరం చేశారు. క్షతగాత్రులతో లెబనాన్‌లోని అన్ని తరువాయి 2 వ పేజీలో...



## కారెక్కనున్న జీవన్ రెడ్డి!

## నేడు జగిత్యాలకు కేటీఆర్

### మధ్యాహ్నం 2 గంటలకు ఇరువురి భేటీ.. పార్టీలోకి సాదర ఆహ్వానం!?

జగిత్యాల రాజకీయాల్లో గురువారం కీలక పరిణామం చోటుచేసుకోనుంది. మాజీ మంత్రి జీవన్ రెడ్డి నివాసానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లనున్నారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీలోకి రావాల్సిందిగా కేటీఆర్ ఆహ్వానించనున్నారు. కేటీఆర్ ఇటీవలే అమెరికా పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు చేరుకున్న సంగతి తెలిసిందే.

జగిత్యాల/హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): గురువారం కేటీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పర్యటించనున్నారు. గురువారం మధ్యాహ్నం 12:30 గంటలకు కరీంనగర్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను కలువనున్నారు. అనంతరం బీఆర్ఎస్ నేతలతో కలిసి జగిత్యాలకు వెళ్లనున్నారు. జగిత్యాలలోని జీవన్ తరువాయి 2 వ పేజీలో...

### బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,382 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,014 |

### విశ్వవాణి



వర్జీనియాకు చెందిన ఓ హైస్కూల్ విద్యార్థిని మియా హెల్లర్ నీటిలో మైక్రోప్లాస్టిక్స్‌ను నిర్మూలించే ఫిల్టర్‌ను తయారు చేసింది. ఆ ఫిల్టర్ 96 శాతం మైక్రో ప్లాస్టిక్స్ తొలగించేస్తుందని ఆమె పేర్కొంది.

## మంత్రులే టార్గెట్!

- కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ దుష్ప్రచారం
- నాదర్‌గుల్ భూములపై హరీశ్ ఆరోపణలు తప్పు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మండిపాటు



హైదరాబాద్ శివారు నాదర్‌గుల్ భూముల విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు దుష్ప్రచారం చేస్తున్నారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్రస్థాయిలో ఫైరయ్యారు. హరీశ్ ఆరోపిస్తున్న సర్వే నంబర్ 613లోని భూములను 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంస్థలకు రిజిస్ట్రేషన్ చేసిందని అన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): భూముల మ్యుటేషన్ జరిగిన 2016లోనూ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందని అన్నారు. 2014, 2016 లో జరిగిన రిజిస్ట్రేషన్లతో తమ ప్రభుత్వానికి ఏం సంబంధమని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజా పాలన, స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అందుకే తరువాయి 2 వ పేజీలో...



## 'కాళేశ్వరం' తీర్పు వాయిదా

### ఉన్నఫలంగా 22వ తేదీకి మార్పు

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో విచారణ జరిపిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్‌లపై తుది తీర్పు వాయిదా పడింది. మెగా ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం, నిర్వహణల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): దీన్ని సవాలు చేస్తూ బీఆర్ఎస్ అధినేత.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారిణి స్మితా సభర్వాల్, ఐఏఎస్ మాజీ అధికారి ఎస్.కె.జోషిలు విడివిడిగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ తరువాయి 2 వ పేజీలో...

## 3 నెలల్లో 'మామునూరు'కు భూమిపూజ

- కొత్తగూడెం ప్రతిపాదనలూ పరిశీలిస్తున్నాం
- ఆదిలాబాద్‌లో భారీ ఎయిర్ పోర్టు
- 17న భూముల పరిశీలన: కేంద్రం



తెలంగాణలోని ఎయిర్ పోర్టులపై అన్ని డిమాండ్లు పరిశీలిస్తున్నామని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ఫీజబులిటీ ఉన్న చోట ఎయిర్ పోర్టుల నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

న్యూఢిల్లీ: వరంగల్ ప్రజల చిరకాల స్వప్నం మామునూరు ఎయిర్ పోర్టుకు 3 నెలల్లో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆదిలాబాద్, కొత్తగూడెం ఎయిర్ పోర్టు ప్రతిపాదనలనూ తరువాయి 2 వ పేజీలో...

## నేడు 3 రాష్ట్రాల్లో ఓట్ల పండుగ



- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎన్నికల సంఘం
- కేరళం, అస్సాం, పుదుచ్చేరిలో పోలింగ్

దేశవ్యాప్తంగా రాజకీయ ఉత్కంఠ రేపుతున్న మూడు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. కేరళం, అస్సాం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో గురువారం ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా రేపు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ సమయాన్ని కేటాయించారు.

న్యూఢిల్లీ: ఈ ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. సమస్యాత్మక ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరించడంతో పాటు, పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండనుంది. ఈ మూడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం 296 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుండగా, సుమారు 6 కోట్లకు పైగా ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఇక రాష్ట్రాల వారీగా పోలింగ్ కేంద్రాల వివరాలను పరిశీలిస్తే.. తరువాయి 2 వ పేజీలో...



## 17 లక్షల కోట్ల లాభం

### ఆగిన యుద్ధం.. ఇన్వెస్టర్లకు బూస్ట్

ముంబై: ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం భారతీయ స్టాక్ మార్కెట్‌కు లాభాలపంట పండించింది. ఇన్వెస్టర్లకు భారీ లాభాలు తెచ్చిపెట్టింది. బుధవారం, ఎస్ అండ్ పీ బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 2,946.32 పాయింట్లు లాభపడి, 77,562.90 పాయింట్ల వద్ద ముగిసింది. అలాగే, ఎన్ఎస్ఈ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

9.4.2026

మేషం: దూర ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు భాదిస్తాయి. బంధు మిత్రులతో ఆకస్మిక వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో ఇతరులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. దైవ చింతన పెరుగుతుంది. వ్యాపారాలు అంతగా కలిసిరావు.

వృషభం: స్థిరాస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు కలసి వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభించిన ఆశించిన లాభాలు అందుకుంటారు. జీవిత భాగస్వామితో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రులతో కీలక విషయాలు చర్చిస్తారు. ఉద్యోగులకు ప్రోత్సాహకాలు అందుతాయి. నిరుద్యోగులకు ఉద్యోగ అనుకూలత కలుగుతుంది.

మిథునం: సోదరులతో ఆస్తి వివాదాలు తొలగి ఊరట చెందుతారు. వాహన వ్యాపారస్తులు నూతన లాభాలు అందుకుంటారు. అవసరానికి సన్నిహితుల సాయం అందుతుంది. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది. వృత్తి ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభ సూచనలున్నవి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. దూర ప్రయాణాల సూచనలున్నవి. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయాలలో కొంత చికాకు తప్పదు. ఇంటా బయట అప్రమత్తంగా వ్యవహరించాలి. ఉద్యోగమున అదనపు బాధ్యతలుంటాయి. ఆర్థికంగా కొంత నిరాశ తప్పదు.

సింహం: తల్లిదండ్రుల ఆరోగ్యం విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. వృత్తి వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. బంధువులతో వివాదాలు కలుగుతాయి. ఉద్యోగమున అధికారుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలించక నిరాశ పెరుగుతుంది.

కన్య: నూతన పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తిచేస్తారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి ఉద్యోగ యత్నాలలో విజయం సాధిస్తారు. సంఘంలో స్నేహితుల నుండి ఊహించని ధనలాభం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక పురోగతి సాధిస్తారు. నూతన వాహనాలు కొనుగోలు చేస్తారు.

తుల: ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ప్రయాణాల వలన శారీరక శ్రమ పెరుగుతుంది. బంధుమిత్రుల నుండి ఋణ ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారమునకు పెట్టుబడులు సకాలంలో అందవు. వృత్తి ఉద్యోగాలలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు.

వృశ్చికం: అన్ని రంగాల వారికి అనుకూల వాతావరణం. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. కుటుంబ సభ్యుల ఆదరణ పెరుగుతుంది. భూ సంబంధిత క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలు అందుకుంటారు. వృత్తి వ్యాపారములు పుంజుకుంటాయి. ఉద్యోగస్తులకు అధికారుల సహాయ సహకారాలు అందుతాయి.

ధనస్సు: వృత్తి వ్యాపారమున నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. దూర ప్రయాణాలలో మార్గ అవరోధాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది.

మకరం: సన్నిహితుల నుండి విలువైన విషయాలు సేకరిస్తారు. వృత్తి వ్యాపారాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. ఉద్యోగ విషయమై ఆశించిన మార్పులు చోటు చేసుకుంటాయి. కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

కుంభం: కీలక వ్యవహారాలలో స్వంత నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతారు. మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఆకస్మిక ధన లాభాలుంటాయి. స్థిరాస్తి సంబంధిత వివాదాల నుంచి బయటపడతారు. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో పనికి తగిన గుర్తింపు లభిస్తుంది.

మీనం: కొన్ని వ్యవహారాలలో సన్నిహితుల నుండి మాటలు పడవలసి వస్తుంది. నూతన వ్యాపారాలు ప్రారంభానికి ఆటంకాలు కలుగుతాయి. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. తగినంత ఆదాయం లభించదు. చేపట్టిన పనులలో జాప్యం కలిగిన నిదానంగా పూర్తిచేస్తారు. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి పెరుగుతుంది.

# 10 నిమిషాల్లో 100 దాడులు

**మొదటి పేజీ తరువాయి**

ఆసుపత్రులు నిండిపోయాయి. 1982 తర్వాత లెబనాన్ పై ఇదే అతిపెద్ద దాడి అని అధికారులు చెబుతున్నారు. ఇజ్రాయెల్ దాడుల్లో లెబనాన్ కు చెందిన ప్రముఖ మతపెద్ద సాధిక్ అలీ నబుల్సీ మృతి చెందారు. బీరుట్ సహా పలు ముఖ్య ప్రాంతాల్లోని హెజ్బుల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడి చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. హెజ్ బొల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్స్, ఉగ్ర స్థావరాలు, ఉగ్రవాదులు మౌలిక సదుపాయాలు ధ్వంసం చేసినట్లు ఇజ్రాయెల్ తెలిపింది. ఈ దాడులపై హెజ్ బొల్లా గ్రూప్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ కూడా భాగమేమని పాకిస్తాన్ చెబుతోంది. అయినప్పటికీ లెబనాన్ పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తోంది. ఈ దాడులు కొనసాగితే ఇరాన్, అమెరికా సీజ్ ఫైర్ పైనా ప్రభావం పడనుంది. లెబనాన్ పై దాడులకు నిరసనగా ఇరాన్ హోర్మోజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలను అడ్డుకుంది.



### ఇరాన్ వార్నింగ్

ఇజ్రాయెల్ లెబనాన్‌పై దాడులు కొనసాగిస్తే, అమెరికాతో కాల్పుల విరమణ ఒప్పందం నుంచి వైదొలుగుతామని ఇరాన్ హెచ్చరించింది. బుధవారం హోర్మూజ్ జలసంధిలో రాకపోకలను నిలిపివేసింది. హోర్మూజ్ లో చిక్కుకున్న నౌకలకు ఈ జలమార్గం ఇంకా మూసివేసే ఉంటుందని ఇరాన్ నౌకాదళం తెలిపింది. ఇరాన్‌పై దాడిని రెండు వారాల పాటు నిలిపివేయాలన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయానికి తమ మద్దతు ఉంటుందని ఇజ్రాయెల్ చెబుతోంది. అయినప్పటికీ తమ దేశంపై దాడుల్లో హిజ్బుల్లా పాత్ర కారణంగా కాల్పుల విరమణ నిబంధనలు, షరతులు లెబనాన్‌కు వర్తించవని ఇజ్రాయెల్ చెప్పింది. మరోవైపు, ఇరాన్, అమెరికా ఒప్పందంలో లెబనాన్ భాగం కాదని వైట్ హౌస్ ధ్రువీకరించింది. ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ ఆక్సియోస్‌తో మాట్లాడుతూ.. రెండు వారాల సీజ్ ఫైర్ లో లెబనాన్ భాగం కాదని పేర్కొంది. టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించిన పాకిస్థాన్ కు.. ఇరాన్, లెబనాన్‌లలో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఉల్లంఘనల గురించి చర్చించడానికి ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ ఫోన్ చేసినట్లు తెలుస్తోంది.

# 'కాళేశ్వరం' తీర్పు వాయిదా

**మొదటి పేజీ తరువాయి**

జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టి మార్చి 12న తీర్పు వాయిదా వేసింది. బుధవారం తుది తీర్పు వెల్లడించాల్సి ఉంది. అయితే.. తీర్పును ఈ నెల 22వ తేదీకి వాయిదా వేసింది ధర్మాసనం. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో అవకతవకలు జరిగాయంటూ.. జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం 2024 మార్చి 14న జీవో 6ను జారీ చేసింది. కమిషన్ చేపట్టిన విచారణ ప్రక్రియలో ఉల్లంఘనలు జరిగాయని, అభియోగాలు మోపే ముందు తమ వాదనను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషనర్లు పేర్కొన్నారు. విస్తృత ప్రజాప్రయోజనాల దృష్ట్యా కమిషన్ వేశామంటూ మరొకరి పరువు ప్రతిష్ఠలు దెబ్బతీయడం సరికాదన్నారు. మరోవైపు ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ... ప్రజాప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని కమిషన్ వేసినట్లు తెలిపారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక రికార్డుల ఆధారంగానే ఇచ్చిందన్నారు. ఇందులో భాగంగా పిటిషనర్లతోపాటు పలువురికి నోటీసులు ఇచ్చి విచారణ చేపట్టిందని.. కాబట్టి పిటిషన్‌లను కొట్టివేయాలని కోరారు.

# కారెక్కనున్న జీవన్ రెడ్డి!

**మొదటి పేజీ తరువాయి**

రెడ్డి నివాసానికి చేరుకోనున్నారు. ఇప్పటికే జీవన్ రెడ్డితో సంప్రదింపులు జరిపిన కేటీఆర్.. గురువారం స్వయంగా కలిసి ఆయనను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించనున్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్‌తోపాటు పార్టీకి చెందిన పలువురు నేతలు ఈ సమావేశంలో పాల్గొనున్నారు. సీనియర్ నాయకుడినైన తనను అధికార కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం చేస్తుందని జీవన్ రెడ్డి పలుమార్లు ఆరోపించారు. అంతేకాకుండా.. జగిత్యాలలో తనపై గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌ను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకున్నారు. ఈ సమయంలో జీవన్ రెడ్డిని సైతం కాంగ్రెస్ పార్టీ నాయకులు పక్కన పెట్టారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సంజయ్ వర్గానికి చెందిన అభ్యర్థికి చైర్మన్ పదవి కట్టబెట్టారు. జీవన్ రెడ్డి వర్గానికి చెందిన నేతకు మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి కేటాయించారు. అలాగే పార్టీలో సీనియర్ అయిన తనకు పీసీసీ పదవి కూడా కేటాయించకపోవడం పట్ల జీవన్ రెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అందుకే ఆయన ఆ పార్టీ వీడారు. జగిత్యాల ప్రాంతాల్లో జీవన్ రెడ్డి బలమైన నేతగా కొనసాగుతున్నారు. ఆయనను పార్టీలోకి తీసుకోవడం ద్వారా జిల్లాలో పార్టీకి పుర్వ వైభవం వస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.

### కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్ భేటీ

గజ్వేల్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు భేటీ అయ్యారు. బుధవారం ఉదయం ఎర్రవల్లి ఫాంహౌస్‌కు చేరుకున్న మాజీ మంత్రులు.. కేసీఆర్‌తో కీలక సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్లీనరీ నిర్వహించడంపై ప్రధానంగా చర్చించారు. ఏప్రిల్ 27న ప్లీనరీ లేదా జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించే యోచనలో గులాబీ అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్లీనరీ లేదా జనరల్ బాడీ పెట్టాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు సమాచారం. అటు.. జగిత్యాల కీలక నేత జీవన్ రెడ్డితో కేటీఆర్ భేటీ, పార్టీలోకి ఆహ్వానంపైనా చర్చించినట్లు తెలిసింది.

# మంత్రులే టార్గెట్!

**మొదటి పేజీ తరువాయి**

ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో వారి ప్రవర్తనను ప్రజలంతా గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతారని ఫైరయ్యారు. ఎటువంటి ఆధారాలు లేకుండానే నాదర్‌గుల్ భూముల్లో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సన్నబియ్యం పథకానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేకనే ఇటువంటి దుష్ప్రచారానికి తెరలేపారని విమర్శించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణం పూర్తయితే బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోతుందన్న భయంతో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డిని, అలాగే మద్యం పాలసీ, టూరిజం పాలసీల విషయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కావాలనే టార్గెట్ చేస్తున్నారని పొంగులేటి ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. వారికి అంటిన బురదను ఇప్పుడు మంత్రులందరికీ పూయాలని చూస్తున్నారని ఫైరయ్యారు. నాదర్‌గుల్ భూముల విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అబద్ధాలేనని పొంగులేటి కొట్టిపారేశారు. ప్రొహిబిటెడ్ భూముల్లో తమ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదన్నారు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో తమ కుటుంబ సభ్యులెవరూ లేరని అన్నారు. తన కుటుంబ సభ్యులు ఉన్నారని నిరూపించాలని హరీశ్ రావుకు సవాల్ విసిరారు. సర్వే నంబర్ 613లోని భూములను 2014లోనే మూడు సంస్థలకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసిందని ఆధారాలతో సహా చూపుతానని అన్నారు. ఈ భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అప్పుడు కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందన్నారు. నాలా కన్వర్షన్ విషయంలో సదరు సంస్థలు కోర్టుకు వెళ్తే అప్పటి కేసీఆర్ ప్రభుత్వం కౌంటర్ కూడా దాఖలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక అవి ప్రభుత్వ భూములని కౌంటర్ దాఖలు చేసామన్నారు. గతంలో వాటాల ఒప్పందం చేసుకుని.. భూములు కట్టబెట్టి వాటాలు దక్కలేదని ఇప్పుడు తమపై నిందలు వేయడం సరైంది కాదని మంత్రి పొంగులేటి తీవ్రస్థాయిలో విమర్శించారు.

### 3 నెలల్లో 'మామునూరు'కు భూమిపూజ

బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. ఆదిలాబాద్ లో పెద్ద ఎయిర్ పోర్టు నిర్మించాలని కేంద్రం భావిస్తోందని సైనిక, పౌరుల అవసరాలకు అనుగుణంగా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు నిర్మించబోతున్నట్లు చెప్పారు. ఇందుకోసం సివిల్ ఏవియేషన్‌తో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రక్షణశాఖ సైతం చెప్పిందని వెల్లడించారు. ఈ నెల 17న ఆదిలాబాద్ భూముల పరిశీలనకు అధికారులు వెళ్తారని, రక్షణ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశాక నిర్ణయం తీసుకుంటారన్నారు. ఆదిలాబాద్ లో రక్షణ శాఖకు 360 ఎకరాలు ఉందని, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం 450 ఎకరాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఎయిర్ పోర్టు ఏర్పాటుకు కావాల్సిన అనుకూలతు ఆదిలాబాద్ లో ఉన్నాయని చెప్పారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం వద్ద ఎయిర్ పోర్టును రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించింది. ఇక్కడ ఎయిర్ పోర్టు ప్రతిపాదనపై ఫీజబులిటీ నివేదిక సానుకూలంగా ఉందని చెప్పారు.

# నేడు 3 రాష్ట్రాల్లో ఓట్ల పండుగ

**మొదటి పేజీ తరువాయి**

కేరళంలోని 140 అసెంబ్లీ స్థానాలకు గానూ 30,471 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అస్సాంలోని 126 అసెంబ్లీ స్థానాలకు అత్యధికంగా 31,486 పోలింగ్ కేంద్రాలను, పుదుచ్చేరిలోని 30 స్థానాలకు 1,009 కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారు. పోలింగ్ సిబ్బంది ఇప్పటికే ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలతో ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. ఈ మూడు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ఫలితాలు కూడా మే 4, 2026న వెలువడనున్నాయి. కేరళలో ఎల్డీఎఫ్-యూడీఎఫ్ మధ్య, అస్సాంలో ఎన్డీఏ-మహాజోత్ కూటముల మధ్య ప్రధాన పోటీ నెలకొనడంతో ఈ ఎన్నికల ఫలితాలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ప్రతి ఓటరు బాధ్యతగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు విజ్ఞప్తి చేశారు.

# వడ్డీ రేట్లు యథాతథం

**మొదటి పేజీ తరువాయి**

స్థిరంగా ఉండటంతో.. బ్యాంకులు పెద్దగా లోన్లు సహా ఫిక్స్‌డ్ డిపాజిట్ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలు లేవు. పశ్చిమాసియా ఉద్రిక్తతలు భారత ఆర్థిక వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని మల్హోత్రా చెప్పారు. అయినప్పటికీ జీడీపీ వృద్ధి రేటు ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 6.9 శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు. ద్రవ్యోల్బణం సగటున 4.6 శాతంగా ఉండొచ్చని అంచనా వేశారు. ఇటీవల ఇరాన్-ఇజ్రాయెల్- అమెరికా యుద్ధం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. చమురు, గ్యాస్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపింది. ఈ క్రమంలోనే వంటగ్యాస్ ధరలు, ఏటీఎఫ్ ధరలు, ప్రీమియం పెట్రోల్, డీజిల్ ధరలు వంటివి పెరిగాయి. క్రూడాయిల్ రేట్లు పెరగడంతో ద్రవ్యోల్బణం పెరిగింది. దీంతో ఈసారి ఆర్బీఐ వడ్డీ రేట్లను పెంచుతుందని అంతా భావించారు. అయితే అలా జరగలేదు. మరోసారి రెపో రేట్లను స్థిరంగా ఉంచుతున్నట్లు ప్రకటించగా.. లోన్లు తీసుకునేవారు ఊపిరిపీల్చుకున్నారు. గతేడాది ద్రవ్యోల్బణం తగ్గుతూ వచ్చిన క్రమంలో.. ఆర్బీఐ వడ్డీ రేట్లను భారీగా తగ్గిస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. జనవరి సమయంలో గరిష్ఠంగా రెపో రేటు 6.50 శాతంగా ఉండగా.. తొలుత గతేడాది ఫిబ్రవరిలో 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతానికి చేర్చింది. తర్వాత మళ్లీ ఏప్రిల్‌లో 25 బేసిస్ పాయింట్లు తగ్గించి దీనిని 6 శాతానికి తీసుకొచ్చింది. జూన్‌లో అయితే ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.50 శాతానికి తీసుకొచ్చింది. మళ్లీ డిసెంబరు సమీక్షలో కూడా 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.25 శాతానికి చేర్చింది. ఇలా మొత్తంగా 11 నెలల వ్యవధిలోనే రికార్డు స్థాయిలో 1.25 శాతం లేదా 125 బేసిస్ పాయింట్ల మేర వడ్డీ రేట్లను తగ్గించింది. ఇది లోన్లు తీసుకునే వారికి భారీగా ఊరట కల్పించింది. ఆర్బీఐ రెపో రేట్లను తగ్గిస్తే.. దానికి అనుగుణంగా బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు ఈ రెపో రేటుకు లింక్ అయి ఉండే లోన్ వడ్డీ రేట్లను తగ్గించాల్సి ఉంటుంది. దీంతో గతేడాది లోన్ వడ్డీ రేట్లను బ్యాంకులు భారీగా తగ్గించాయి.

# 17 లక్షల కోట్ల లాభం

**మొదటి పేజీ తరువాయి**

నిఫ్టీ కూడా ఏకంగా 873.35 పాయింట్లు పెరిగి, 23,997.35 పాయింట్ల వద్ద ముగిసింది. ఏకంగా ఈ ఒక్కరోజే 4 శాతం లాభాలతో మదుపర్ల సంపద రూ.17.1 లక్ష కోట్ల వరకు పెరిగింది. దీంతో మొత్తం మార్కెట్ విలువ రూ.445.8 లక్షల కోట్లకు చేరింది. ఉదయం ప్రారంభం నుంచి మార్కెట్ లాభాల్లోనే నడిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 77,627.15 కోట్ల గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 24,025.15 పాయింట్ల గరిష్ట స్థాయికి చేరింది. ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గనుండటం వంటి పరిణామాలు మార్కెట్‌కు అనుకూలంగా మారాయి. అలాగే, కీలక వడ్డీ రేట్లను ఆర్బీఐ యథాతథంగా ఉంచడం కూడా కలిసొచ్చింది. ఇండియన్ మార్కెట్‌తోపాటు అంతర్జాతీయ మార్కెట్లు కూడా ఈ రోజు లాభాలబాటపట్టాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి 6 శాతం, జపాన్ నిక్కీ 5 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 3 శాతం లాభాపడ్డాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారక విలువ 47 పైసలు పెరిగి, 92.59 వద్ద కొనసాగుతోంది. కాల్పుల విరమణ ఒప్పందంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా భారీగా తగ్గిపోయాయి. అంతకుముందు రోజు బ్యారెల్ క్రూడాయిల్ ధర దాదాపు 109 డాలర్ల వద్ద ఉండగా, బుధవారం భారీగా తగ్గి 94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దాదాపు 16 శాతం పైగా చమురు ధర తగ్గింది. ఔన్స్ బంగారం ధర 4788 డాలర్ల వద్ద స్థిరపడింది. ఈ రోజు షేర్లలో ఇండిగో ఏకంగా పది శాతం మేర లాభాలు పొందింది.

# పీస్..పీస్

**మొదటి పేజీ తరువాయి**

తెలిపింది. ఇరాన్ మీద దాడులు ఆపేస్తే, ఇరాన్ సైతం రెండు వారాల పాటు యుద్ధ విరమణకు ఒప్పుకుంటుందని, హర్మూజ్ గుండా నౌకల ప్రయాణానికి తాము అనుమతిస్తామని తెలిపింది. ఇదొక చరిత్రాత్మక విజయం అంటూ అభివర్ణించిన ఇరాన్.. ఇజ్రాయెల్, అమెరికా తమ చేతిలో అత్యంత ఘోరమైన పరాభవాన్ని ఎదుర్కొని, తమ ప్రతిపాదనలకు అంగీకరించాయని ప్రకటించింది. వీరుల త్యాగం, ఖమేనీ చిందించిన రక్తం, మొజ్తాబా ఖమేనీ నాయకత్వం వెరసి తాము ఈ యుద్ధంలో విజయం సాధించామని ఇరాన్ తెలిపింది. యురేనియం ని శుద్ధి చేసేందుకు (ఎన్రిచ్మెంట్), హర్మూజ్ పై ఇరాన్ కంట్రోల్, తక్షణమే అన్ని ఆంక్షలను ఎత్తేయడం సహా తమ 10 ప్రతిపాదనలకు అమెరికా గత్యంతరం లేక ఒప్పుకుందని ఇరాన్ ప్రకటించింది. మరోపక్క అమెరికా సైతం తమ మిలిటరీ లక్ష్యాలను తాము చేరుకున్నామని, తాము అనుకున్నదా నికంటే ఎంతో అపూర్వమైన విజయాన్ని సాధించామని ట్రంప్ ప్రకటించారు. మధ్యప్రాచ్యంలో శాంతిని నెలకొల్పడానికి తాము ఈ ఒప్పందానికి అంగీకరిస్తున్నట్టు ట్రంప్ తెలిపారు. అయితే ఇరు పక్షాలు ఏప్రిల్ 10 నుంచి రెండు వారాలపాటు ఇస్లామాబాద్ లో చర్చలు జరపనున్నారు. అమెరికా తరపున వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్, ఇరాన్ తరపున పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బగేర్ గాలిబాఫ్ ఈ చర్చలకు నాయకత్వం వహించనున్నారు. యుద్ధం మొదలైన తర్వాత రెండు దేశాల మధ్య జరుగుతున్న తొలి ముఖాముఖి భేటీ ఇదే. అమెరికా విధిస్తున్న ఆంక్షల సడలింపు, ప్రాంతీయ భద్రత, ఇరాన్ అణు కార్యక్రమం వంటి అంశాలు చర్చల్లో ప్రధానంగా రానున్నాయి. ఒకవేళ ఈ చర్చలు సఫలమైతే, దశాబ్దాలుగా నలుగుతున్న అమెరికా-ఇరాన్ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి తుపాకులు మూగబోయినప్పటికీ దౌత్య రంగంలో మాత్రం యుద్ధం మొదలైంది. ప్రపంచ దేశాలన్నీ ఇప్పుడు వాషింగ్టన్, టెహ్రాన్ వైపు ఆసక్తిగా చూస్తున్నాయి. శాశ్వత శాంతి ఒప్పందం కుదురుతుందా లేక ఇది కేవలం ఉద్రిక్తతలకు చిన్న విరామమేనా అన్నది వేచి చూడాలి.

# రసాయన ఎరువులకు 41,543 కోట్ల సబ్సిడీ

**మొదటి పేజీ తరువాయి**

రాయితీని మంజూరు చేసింది. ఈ నిర్ణయం ద్వారా రైతులు సబ్సిడీ ధరలకే నాణ్యమైన ఎరువులను పొందే అవకాశం ఉంటుంది. వ్యవసాయ రంగంలో పెట్టుబడి ఖర్చులను తగ్గించి, దిగుబడిని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ నిధులను కేటాయించింది. ఎరువుల లభ్యతలో ఎలాంటి కొరత లేకుండా చూడటమే కాకుండా.. విదేశీ మార్కెట్ ఒడిదుడుకుల నుంచి అన్నదాతను కాపాడటానికి ఈ భారీ సబ్సిడీ రక్షణ కవచంలా పనిచేస్తుందని కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడించారు. రైతు సంక్షేమంతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ప్రాధాన్యత ఇస్తూ, జైపూర్ మెట్రో ప్రాజెక్టు రెండో దశకు రూ. 13 వేల కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. మరోవైపు దేశ ఇంధన భద్రతను పటిష్టం చేసే దిశగా రాజస్థాన్‌లో ప్రతిష్టాత్మకమైన భారీ రిఫైనరీ ప్రాజెక్టును ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. హెచ్‌పీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు వ్యయ సవరణలకు, ఈక్విటీ భాగస్వామ్య మార్పులకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. భారత్ ఇప్పటికే ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా ఎదిగిందని.. ఈ కొత్త ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే దేశీయ సామర్థ్యం మరో 9 మిలియన్ మెట్రిక్ టన్నుల వరకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏటా 258 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురును శుద్ధి చేసే సామర్థ్యం మనకు ఉంది. ఈ రాజస్థాన్ రిఫైనరీ జూలై 2026 నాటికి వాణిజ్యపరంగా కార్యకలాపాలను ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు ధృవీకరించారు. ఇది ఇంధన ఉత్పత్తికే పరిమితం కాకుండా.. పెట్రోకెమికల్ రంగంలో అనేక ఉపాధి అవకాశాలను సృష్టించనుంది.

# ఏసీబీ వలలో ఎయిర్‌పోర్టు పోలీసులు

శంషాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) పోలీస్ అవుట్‌పోస్ట్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఓ కేసులో సహాయం చేసేందుకు లంచం తీసుకుంటున్న ఒక ఇన్‌స్పెక్టర్, ఒక సబ్-ఇన్‌స్పెక్టర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఒక కేసులో చార్జిషీట్ వేయడానికి, ఫిర్యాదుదారుడి కుటుంబ సభ్యులను ఇరికించకుండా ఉండేందుకు ఇన్‌స్పెక్టర్ సంపత్ కనకయ్య, సబ్-ఇన్‌స్పెక్టర్ యు.కె. సిద్ధేశ్వర్ రూ. 5 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ. 2 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుంటుండగా, రంగారెడ్డి జిల్లా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఈ ఆపరేషన్ తర్వాత ఇన్‌స్పెక్టర్ కనకయ్య నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టగా భారీగా నగదు బయటపడింది. ఆయన ఇంట్లో రూ. 33.97 లక్షల నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు కొన్ని ఆస్తి పత్రాలు కూడా లభించాయని, వాటిపై విచారణ జరుపుతున్నామని ఏసీబీ తెలిపింది. విధులను దుర్వినియోగం చేసి అక్రమ లబ్ధి పొందారనే ఆరోపణలపై ఇద్దరు అధికారులను అరెస్ట్ చేసి, నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీబీ జాయింట్ డైరెక్టర్ తెలిపారు. కాగా, భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి వివరాలను ఏసీబీ గోప్యంగా ఉంచింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే, టోల్-ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. మంగళవారం కూడా రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ గోవర్ధన్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. సీడ్ లైసెన్సు కోసం రూ. 1 లక్ష లంచం తీసుకుంటూ ఆయన పట్టుబడ్డారు.





## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## పైలట్ విద్యార్థినిపై లైంగిక దాడి

బేగంపేట-హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బేగంపేటలో ఒక పైలట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. శిక్షణ ఇచ్చే ఉపాధ్యాయుడే విద్యార్థినిపై అఘాయిత్యానికి ఒడిగట్టడం విచారకరం. వివరాల్లోకి వెళితే... బేగంపేటలో ఉన్న పైలట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న ఓ యువతిపై అదే సంస్థలో పనిచేస్తున్న నసీముద్దీన్ అనే వ్యక్తి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కేరళకు చెందిన నిందితుడు, గతేడాది జనవరిలో శిక్షణ ఇస్తాననే సాకుతో ఆమెపై అత్యాచారం చేశాడు. మొదటిసారి అఘాయిత్యం చేసిన సమయంలో ఆ దృశ్యాలను ఫొటోలు, వీడియోలు తీసిన నిందితుడు, వాటిని సోషల్ మీడియాలో పెడతానని బాధితురాలిని బ్లాక్‌మెయిల్ చేశాడు. ఈ వీడియోలను అడ్డం పెట్టుకుని ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. నిందితుడి వేధింపులు భరించలేకపోయిన బాధితురాలు ఎట్టకేలకు బేగంపేట పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ వేధింపుల్లో దమ్మాయిగూడకు చెందిన సల్మాన్ అనే వ్యక్తి కూడా నిందితుడికి సహకరించినట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రధాన నిందితుడు నసీముద్దీన్‌ను అరెస్టు చేశారు. ప్రస్తుతం ఈ కేసులో విచారణ కొనసాగుతోంది.

## పొంగులేటి రాజీనామా చేయాలి

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్పీ

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలిసి నాదర్‌గుల్ భూమి కాజేసే కుట్ర చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిస్సహాయులైన మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఇతర ఎమ్మెల్యేలను పక్కన పెట్టుకొని తన బురదను ఇతరులకు అంటించే ప్రయత్నం చేశారన్నారు. పొంగులేటి ప్రెస్‌మీట్‌లో రెవెన్యూశాఖ మంత్రిగా కాకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సీఈఓగా మాట్లాడినట్లు ఉన్నదన్నారు. తెలంగాణ ప్రభుత్వాన్ని రాఘవ నడిపిస్తున్నారని స్పష్టమైందన్నారు. పొంగులేటి తిమింగళంలా ఆస్తులను దోచుకుంటున్నారని.. ఆయనలా ఊర కుక్కల భాష తమకు రాదన్నారు. నాదర్‌గుల్ భూమిపై దమ్మంటే ఆధారాలతో అమరుల స్థూపం దగ్గరికి రావాలని సవాల్ విసిరారు. బాలాపూర్‌లో 613 సర్వే నంబర్‌లో 374 ఎకరాలు ఉంటే.. అక్కడి ఫెన్సింగ్ మీద కోహినూర్ గ్రూప్, రాఘవ, మెఘా, శిల్పా, ఇన్‌పెక్స్, ఇన్ ఫ్రా అంటూ రోజుకో కంపెనీ పేర్లు ఉంటున్నాయని తెలిపారు. రాత్రికి రాత్రే బోర్డులు మారుతున్నాయన్నారు. కొత్వాల్‌గూడలో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అని రాసి ఉంటే.. తాను, దాసోజు శ్రవణ్ నిజనిర్ధారణ కమిటీ వెళితే రాత్రికి రాత్రే తుడిపేసే ప్రయత్నం చేశారన్నారు. రెవెన్యూశాఖ మంత్రిగా ఉండి బోర్డులు తుడిపే పని చేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. మే 21, 2025లో మైనింగ్ అండ్ జియాలజీ ఇచ్చిన నోటీసు రాఘవ కంపెనీకి కాదా? అని నిలదీశారు.

## చేనేతలో టెండర్ల విధానాన్ని రద్దు చేయాలి

**సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్సీ రమణ లేఖ**

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): చేనేత రంగంలో ఏకీకృత టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ లేఖ రాశారు. పాత విధానంలోనే టీఎస్‌సీవో ద్వారా దుస్తులు కొనుగోలు చేయాలని కోరారు. మార్చి 11 న ఇచ్చిన జీవోను యథాతథంగా అమలు చేయాలని , విద్యార్థుల యూనిఫామ్ తయారీ కి సంబంధించిన 105 కోట్ల రూపాయల ఆర్డర్‌ను టీఎస్‌సీవోకు ఇవ్వాలన్నారు. వివిధ సంక్షేమ శాఖలకు అవసరమయ్యే దుస్తులను టీఎస్‌సీవో ద్వారానే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్రంలో చేనేత రంగం అనేది కేవలం ఒక పరిశ్రమ మాత్రమే కాకుండా, వేలాది కుటుంబాల జీవనాధారమని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాల ప్రతీక అని వెల్లడించారు.

# సొంతంగానూ జనగణన!

## డిజిటల్ విధానంలో నమోదు.. కేంద్ర మంత్రి బండి సంజయ్ వెల్లడి

న్యూఢిల్లీ: జనగణన అధికారుల ప్రమేయం లేకుండానే ఇంట్లో నుండే డిజిటల్ విధానంలో సొంతంగా ప్రతి ఒక్కరూ జనగణన వివరాలను నమోదు చేసుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈనెలలో ప్రారంభమైన జనగణనలో భాగంగా తొలిదశలో హౌజ్ లిస్టింగ్ (ఇంటి వివరాలు), హౌజింగ్ సెన్సెస్ (ఇంట్లోని సౌకర్యాల) వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. అందు కోసం ఫ్ట్రజూం://ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.అఅ వెబ్ సైట్ సందర్శించాలని సూచించారు. బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో జాతీయ రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణాంకాల కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్, జాయింట్ డైరెక్టర్ దీరజ్ జైన్ తోపాటు ఆ విభాగానికి చెందిన పలువురు ఉన్నతాధికారులతో సమావేశమైయ్యారు. జనగణనలో భాగంగా తొలిదశలో చేపడుతున్న హౌజ్ లిస్ట్, హౌజింగ్ సెన్సెస్ వివరాలను వివరించారు. తొలిదశలో లోకేషన్ డిటైల్స్, ఒక కుటుంబం ఉండే ఇల్లు, ఆఫీస్, సౌకర్యాల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఇంట్లోనుండే స్వీయ ఎన్యుమరేషన్ ను నమోదు చేసుకునేందుకు వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. వెంటనే ఆయన డిజిటల్ విధానంలో సొంతంగా తన ఇల్లు, ఇంట్లోని సౌకర్యాల వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రధాని మోడీ నాయకత్వంలో డిజిటల్ విధానంలో జనగణన నిర్వహించడం శుభపరిణామమని, భారత అభివృద్ధిని మరింత వేగవంతం చేసి, వికసిత భారత్ లక్ష్య సాధనకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో ఈ మహత్తర జాతీయ కార్యక్రమాన్ని కాగితాలతో పనిలేకుండా డిజిటల్ సాధనాలతో నిర్వహించడం, పౌరులకు స్వీయ-ఎన్యూమరేషన్ అవకాశాన్ని కల్పించామన్నారు. ఇప్పటికే పెద్ద సంఖ్యలో ప్రజలు స్వీయ-ఎన్యూమరేషన్ పోర్టల్ ద్వారా తమ వివరాలను సమర్పించేందుకు ముందుకు వస్తుండటం సంతోషదాయకమని చెప్పారు. ప్రతి ఒక్కరూ అధికారిక పోర్టల్‌ను సందర్శించి స్వీయ-ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.



## మెట్రోలో జూపల్లి ప్రయాణం

మియాపూర్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): మంత్రి జూపల్లి కృష్ణారావు ఒక సామాన్య ప్రయాణికుడిలా మెట్రోలో ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచారు. హైదరాబాద్‌లో ఒక ప్రైవేట్ కార్యక్రమానికి వెళ్లాల్సి ఉండగా, ట్రాఫిక్ ఇబ్బందులను దాటుకుని త్వరగా చేరుకోవడానికి మంత్రి మెట్రోను ఎంచుకున్నారు. సెక్యూరిటీ హడావుడి లేకుండా ఎర్రమంజిల్ స్టేషన్‌లో స్వయంగా టికెట్ కొనుగోలు చేసి మియాపూర్ వరకు ప్రయాణించారు. రైలులో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటంతో, మంత్రి తన హోదాను పక్కన పెట్టి తోటి ప్రయాణికులతో కలిసి నిలబడే వెళ్లారు. ప్రయాణ సమయంలో తోటి ప్రయాణికులతో సరదాగా మాట్లాడారు. మెట్రో సౌకర్యాలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రిని తమ మధ్య చూసిన ప్రయాణికులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపగా, జూపల్లి ఎంతో ఓపికగా అందరితో ఫొటోలు దిగారు. సమయాన్ని ఆదా చేస్తూ, ట్రాఫిక్ చిక్కులు లేకుండా గమ్యస్థానాలకు చేరడానికి మెట్రో ఎంతగానో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. గతంలోనూ ఆయన ఎల్బీ నగర్ నుంచి కేపీహెచ్‌బీ వరకు ఇలాగే ప్రయాణించి వార్తల్లో నిలిచారు.



## హరీశ్ వనపర్తి పర్యటనకు అనుమతి

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావుకు హైకోర్టులో ఊరట లభించింది. హరీశ్ రావుకు వనపర్తి జిల్లాలో పర్యటించేందుకు అనుమతినిస్తూ తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హరీశ్ రావు పర్యటనకు అనుమతి లేదన్న జిల్లా ఎస్పీ ఆదేశాలను కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. గొల్లపల్లి రిజర్వాయర్‌ను వ్యతిరేకిస్తూ స్థానిక రైతులు ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే, వారికి మద్దతుగా మాజీ మంత్రి అక్కడి పర్యటించి భారీ బహిరంగ సభ పెట్టాలని నిర్ణయించారు. ఈ సభకు తొలుత జిల్లా ఎస్పీ అనుమతులు ఇచ్చారు. అనంతరం అకస్మాతుగా అనుమతులు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనిపై ఆగ్రహించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు.. తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. తొలుత అనుమతులు ఇచ్చి ఆపై నిరాకరించారంటూ పిటిషన్ వేశారు.

# నిద్ర మత్తులో బీఆర్ఎస్


## అబద్ధాలతో అధికార పార్టీ.. కల్వకుంట్ల కవిత మండిపాటు


హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): తెలంగాణ చరిత్రను మార్చే, భవిష్యత్తును తీర్చిదిద్దే పార్టీ ఈ నెల 25వ తేదీన వస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఆవిర్భావం రోజు అద్భుతమైన ఎజెండా ప్రకటిస్తామని చెప్పారు. కొత్త నెత్తురు, కొత్త రాజకీయంతో తెలంగాణ భవిష్యత్తును మారుస్తామని.. దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. గద్వాల నియోజకవర్గానికి చెందిన నడిగడ్డ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు గొంగళ్ల రంజిత్ కుమార్, ఆయన అనుచరులు తెలంగాణ జాగృతిలో చేరారు. కవిత వారికి కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాగృతి తరపున ప్రశ్నిస్తాం... పోరాడతాం.. పరిష్కరిస్తామని తెలిపారు. వెలుగుమట్ల తరహాలో ప్రజల్లోనే ఉండి సమస్యలపై పోరాడతామని అన్నారు. 'బీఆర్ఎస్ పార్టీ అచేతన స్థితిలో ఉంది.. నిద్రపోతోంది. గద్వాలలో చేనేత, పత్తి రైతులకు అన్యాయం జరుగుతుంటే కూడా ప్రశ్నించడం లేదు. కాంగ్రెస్ పార్టీ అబద్ధాలతో ప్రజలను వంచిస్తోంది. రాష్ట్ర పాలన మొత్తం ఢిల్లీ నుంచే జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంగా మారింది. ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తే జోగులాంబ జిల్లాలో తెలంగాణ జాగృతికి మొదటి విజయం దక్కింది. ఎమ్మెల్యే సీట్లలో మొదట గద్వాలలోనే విజయం సాధిస్తామని విశ్వాసం ఉంది. చూస్తుంటే గద్వాల గడీ మీద ఉద్యమకారుల జెండా ఎగురుతుందని అనిపిస్తోంది' అని కవిత అన్నారు.



## 100 మీటర్లు ఈడ్చుకెళ్లిన కారు.. ముగ్గురి మృతి

హస్తినాపురం-హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో హోండా కారును వేగంగా నడిపిన ఒక డ్రైవర్, రోడ్డు మీద నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీద వెళుతున్న మరో ఇద్దరు యువకులను ఢీకొట్టి 100 మీటర్ల దూరం వరకు ఈడ్చుకుని వెళ్లాడు. ఆ తర్వాత కారు పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచి వెళుతున్న యువకుడు కూడా ఈ ఘటనలో మృతి చెందాడు. కాలేజీ విద్యార్థులు కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.







## కొండగట్టు అంజన్న సేవలో మధుసూదనాచారి

మల్యాల, ఏప్రిల్ 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామిని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదోక్త మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. అనంతరం దేవస్థాన ఈఓ ఎస్ అంజనారెడ్డి శాలువా కప్పి సత్కరించి, లడ్డూ ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## హిందువులంతా కదలి రావాలి

మల్యాల, ఏప్రిల్ 8 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో ఈ నెల 19న జరగనున్న భారీ హిందూ సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. కులమతాల భేదాలను పక్కనబెట్టి ధర్మ పరిరక్షణ కోసం హిందువులందరినీ ఏకం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 'గడప లోపల కులం.. గడప దాటితే హిందువులం' నినాదంతో సామాజిక సామరస్యాన్ని చాటిచెప్పేలా ఈ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొననున్నట్లు వెల్లడించారు. హిందూ సమాజంలో ఐక్యత ఎంతో అవసరమని, అందరూ ఒకే వేదికపైకి రావాల్సిన సమయం ఇదేనని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

## ఇంటికి చేరిన దేవ్ జీ

**కోరుట్లకు మళ్లీ వస్తాననుకోలేదు**

**ప్రజా సమస్యలపై పోరాటం చేస్తా.. దేవ్ జీ స్పష్టీకరణ**

కోరుట్ల, ఏప్రిల్ 8 (ఈవార్తలు): నాలుగు దశాబ్దాల వనవాసం తర్వాత మాజీ మావోయిస్టు అగ్రనేత తిపిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ తన స్వగ్రామం కోరుట్లకు చేరుకున్నారు దీంతో స్థానికంగా ఉద్వేగభరిత వాతావరణం ఏర్పడింది. బుధవారం హైదరాబాద్‌కు వెళ్లిన ఆయన తమ్ముడు గంగాధర్‌తో పాటు కుటుంబ సభ్యులు దేవ్ జీని రిసీవ్ చేసుకుని సాయంత్రం కోరుట్లకు తీసుకువచ్చారు. సుమారు 42 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత స్వగ్రామంలో దేవ్ జీ అడుగుపెట్టడంతో గ్రామంలో భావోద్వేగ వాతావరణం నెలకొంది. ఊరికి చేరుకున్న వెంటనే ఆయన తన పుట్టి పెరిగిన ఇంటికి వెళ్లి, స్వర్గస్తులైన తల్లిదండ్రుల ఫొటోలకు నివాళి అర్పించారు. అనంతరం బంధుమిత్రులు, చిన్ననాటి స్నేహితులతో ఆప్యాయంగా కలుసుకుని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తాను మళ్లీ పుట్టి పెరిగిన కోరుట్లకు వస్తానని కలలో కూడా అనుకోలేదని తెలిపారు. ఏది ఏమైనా బంధుమిత్రులను కుటుంబ సభ్యులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. మరో వైపు సామాజిక, ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం తాను అప్పట్లో ఎలా పోరాడానో, ఇప్పటికీ అదే లక్ష్యంతో ఉంటానని స్పష్టం చేశారు. తాను లొంగిపోయిన తర్వాతే అన్ని విషయాలు మీడియాతో మాట్లాడానని, ప్రస్తుతం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను కలుసుకోవడానికే వచ్చినందున రాజకీయాలపై మాట్లాడటానికి సరైన సమయం కాదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజాక్షేత్రంలో ఉంటూ ప్రజల సమస్యల కోసం పోరాటం కొనసాగిస్తానని, సరైన సమయంలో అన్ని విషయాలను మీడియా ద్వారానే వెల్లడిస్తానని దేవ్ జీ తెలిపారు.

## సహజ మరణానికీ బీమా

**ఆర్టీసీ ఉద్యోగులకు యూబీఐ తీపి కబురు**



హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఈవార్తలు): తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీపి కబురు అందించింది. తమ బ్యాంకులో శాలరీ అకౌంట్ కలిగిన ఆర్టీసీ సిబ్బందికి సామాజిక భద్రతను మరింత పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు కేవలం ప్రమాదవశాత్తూ జరిగే మరణాలకు మాత్రమే వర్తిస్తున్న బీమా సౌకర్యాన్ని, ఇప్పుడు సహజ మరణాలకు కూడా వర్తింపజేస్తున్నట్లు ప్రకటించింది. యూనియన్ బ్యాంక్‌లో శాలరీ అకౌంట్ కలిగి ఉన్న ఉద్యోగి సహజంగా మరణించినా, వారి కుటుంబానికి రూ. 10 లక్షల ఉచిత బీమా సొమ్ము అందుతుంది. ఏప్రిల్ 1 నుండి అమలు: ఈ నూతన నిబంధన 2026, ఏప్రిల్ 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చింది. ఈ సౌకర్యం కోసం ఉద్యోగులు రూపాయి కూడా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదు. ఇది పూర్తిగా బ్యాంకే భరిస్తుంది. గతంలో ఉన్న రూ. 1 కోటి ప్రమాద బీమా సౌకర్యం యథాతథంగా కొనసాగుతూనే, ఈ సహజ మరణ బీమా అదనంగా చేరింది. దాదాపు 38వేలపైగా ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది.



## ప్రజా రవాణాకు ఈ-బస్సులు

**ఏపీ సీఎం చంద్రబాబు ఆదేశాలు**

విజయవాడ, ఏప్రిల్ 8 (ఈవార్తలు): ఏపీలో రహదారులను గుంతలు లేకుండా పటిష్ఠంగా తీర్చిదిద్దాలని, ప్రజా రవాణాకు తక్కువ ఖర్చుతో ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తేవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అమరావతి సచివాలయంలో బుధవారం ఆయన రహదారులు, భవనాలు (ఆర్ అండ్ బీ), రవాణా శాఖల పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న 45 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కేవలం మరమ్మతులు చేయడమే కాకుండా, ఆయా ప్రాంతాల్లోని భౌగోళిక పరిస్థితులను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, వాటికి అనుగుణంగా నాణ్యమైన రోడ్లను నిర్మించాలని సూచించారు. మెరుగైన రహదారుల ద్వారానే ప్రజలకు మౌలిక సదుపాయాలు చేరువవుతాయని, తద్వారా రాష్ట్రాభివృద్ధి వేగవంతమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజా రవాణా వ్యవస్థపైనా సమీక్షలో చర్చించారు. సామాన్యులపై భారం తగ్గించేలా, అతి తక్కువ వ్యయానికే ప్రయాణం సాగించేందుకు వీలుగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆర్టీసీ ఎండీ బాలసుబ్రహ్మణ్యం సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మా దేశం వెళ్లిపోతాం

**విశాఖలో డీఆర్వోను ఆశ్రయించిన ఇరాన్ యువతులు**



విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఈవార్తలు): పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం విశాఖపట్నంలో చదువుకుంటున్న ఇరాన్ విద్యార్థినులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. తమ దేశంలోని కుటుంబ సభ్యులతో సంబంధాలు పూర్తిగా తెగిపోవడంతో, వారి సమాచారం తెలియక తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తమను సురక్షితంగా స్వదేశానికి పంపేందుకు సహాయం చేయాలని కోరుతూ వారు విశాఖ జిల్లా అధికారులను ఆశ్రయించారు. వివరాల్లోకి వెళితే, విశాఖ నగరంలో డీఫార్మసీ చదువుతున్న కొందరు ఇరాన్ యువతులు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) విశ్వేశ్వరనాయుడిని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. యుద్ధం కారణంగా ఇరాన్‌లోని తమ కుటుంబాలతో మాట్లాడలేకపోతున్నామని, వారి యోగక్షేమాల గురించి సమాచారం తెలియక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నామని వివరించారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తాము ఇక్కడ ఉండలేమని, తమను వీలైనంత త్వరగా తిరిగి ఇరాన్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేయాలని వారు అధికారులను వేడుకున్నారు. విద్యార్థినుల విజ్ఞప్తిని స్వీకరించిన అధికారులు, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# వ్యభిచారం ఎందుకు నేరం కాదు?

**స్వలింగ సంబంధాలు ఎందుకు తప్పుకాదు?.. సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్**

న్యూఢిల్లీ: దేశంలో సంచలనం సృష్టించిన రెండు చారిత్రక తీర్పులపై కేంద్ర ప్రభుత్వం తన అభ్యంతరాలను వ్యక్తం చేసింది. వ్యభిచారాన్ని, స్వలింగ సంబంధాలను నేరాల పరిధి నుంచి తొలగిస్తూ సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులు "మంచి నిర్ణయాలు కావు" అని కేంద్రం అభిప్రాయపడింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో ఒక అఫిడవిట్ దాఖలు చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ తీర్పులు భారతీయ సమాజం, వివాహ వ్యవస్థ, సాంప్రదాయిక విలువలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని కేంద్రం తన వాదనలో పేర్కొంది. వివరాల్లోకి వెళితే, 2018లో సుప్రీంకోర్టు రెండు కీలకమైన తీర్పులు వెలువరించింది. భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)లోని



సెక్షన్ 497 కింద వ్యభిచారాన్ని నేరంగా పరిగణించడాన్ని రద్దు చేస్తూ చారిత్రక తీర్పు ఇచ్చింది. అదే సంవత్సరం, మరో ముఖ్యమైన తీర్పులో సెక్షన్ 377ను పాక్షికంగా రద్దు చేసింది. దీని ద్వారా ఇద్దరు వయోజనుల మధ్య అంగీకారంతో ఏర్పడే స్వలింగ సంబంధాన్ని చట్టబద్ధం చేసింది. అప్పట్లో ఈ తీర్పులను పౌర హక్కుల సంఘాలు స్వాగతించాయి. అయితే, తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ రెండు తీర్పుల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టులో తన వైఖరిని స్పష్టం చేసింది. మరో వ్యాజ్యం విచారణ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో కేంద్రం ఈ అభిప్రాయాలను వెల్లడించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పులు సమాజంలోని సున్నితమైన సమతుల్యతను దెబ్బతీస్తాయని, ముఖ్యంగా వివాహ వ్యవస్థ పవిత్రతకు భంగం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేసింది. కుటుంబ వ్యవస్థకు మూలస్తంభమైన వివాహ బంధంపై ఈ తీర్పుల ప్రభావం తీవ్రంగా ఉంటుందని కేంద్రం వాదించింది.

# ఏబీఎన్ చానెల్‌పై వైసీపీ ఫిర్యాదు

**ఎన్బీడీఏ, ఎన్సీడబ్ల్యూలకు లేఖ**

విజయవాడ, ఏప్రిల్ 8 (ఈవార్తలు): ప్రముఖ తెలుగు మీడియా సంస్థ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, మహిళలను కించపరిచేలా, పరువు నష్టం కలిగించేలా కథనాలు ప్రసారం చేసిందంటూ వైసీపీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ మేరకు ఆ సంస్థపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ న్యూస్ బ్రాడ్‌కాస్టర్స్ అండ్ డిజిటల్ అసోసియేషన్ (ఎన్బీడీఏ), జాతీయ మహిళా కమిషన్ (ఎన్సీడబ్ల్యూ)లకు వేర్వేరుగా ఫిర్యాదు చేసింది. వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లెల్ల అప్పిరెడ్డి ఎన్బీడీఏకి ఇచ్చిన ఫిర్యాదులో.. మాజీ ముఖ్యమంత్రి జగన్ ను, పార్టీని లక్ష్యంగా చేసుకుని ఏబీఎన్ ఛానెల్ దురుద్దేశపూర్వకంగా, నిరాధారమైన కంటెంట్‌ను ప్రసారం చేసిందని పేర్కొన్నారు. ఇది జర్నలిజం కాదని, ప్రజలను తప్పుదోవ పట్టించి, విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నమని ఆయన ఆరోపించారు. మరోవైపు, వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి, ఆ ఛానెల్ మహిళలను ఉద్దేశించి అవమానకరమైన వ్యాఖ్యలు చేసిందంటూ జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. వైసీపీ మద్దతుదారులను "వెన్నెముక లేని వాళ్లు" అంటూ ఆ ఛానెల్ లో దూషించారని, మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా మాట్లాడారని ఇరువురు నేతలు తమ ఫిర్యాదుల్లో తెలిపారు. ఈ క్రమంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన వరుదు కల్యాణి, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణను తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అమరావతిలో జరుగుతున్న అవినీతి, జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' (మచిలీపట్నం-విజయవాడ-గుంటూరు) మోడల్‌పై పెరుగుతున్న చర్చ నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే రాధాకృష్ణ ద్వారా ఈ వ్యాఖ్యలు చేయించారని ఆమె ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడమే ఇందుకు నిదర్శనమని ఆమె విమర్శించారు. జర్నలిజం నిబంధనలను ఉల్లంఘించి, కనీస సమాచారం లేకుండా ఏకపక్ష కథనాలు ప్రసారం చేశారని వైసీపీ ఆరోపించింది. సంబంధిత ఛానెల్, యాంకర్, ఎడిటర్, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆ కంటెంట్‌ను వెంటనే తొలగించి, బహిరంగ క్షమాపణ చెప్పాలని వైసీపీ డిమాండ్ చేసింది. మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించేలా చూడాలని కమిషన్లను కోరింది.వ్యభిచారం ఎందుకు నేరం కాదు?

## చంద్రబాబుకు సినిమా చూపిస్తాం

**వచ్చే ఏడాది నా పాదయాత్ర: జగన్**



తాడేపల్లి, ఏప్రిల్ 8 (ఈవార్తలు): కూటమి ప్రభుత్వం "దోచుకో.. పంచుకో.. తినుకో.." అనే సిద్ధాంతంతో పాలిస్తోందని వైసీపీ అధినేత జగన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో జరిగిన సమావేశంలో ఆయన చంద్రబాబు పాలనా తీరును ఎండగట్టారు. వచ్చే ఏడాది తాను పాదయాత్ర ప్రారంభిస్తానని, అప్పటి నుంచి చంద్రబాబుకు ప్రతిరోజూ సినిమా చూపిస్తామని జగన్ హెచ్చరించారు. గత ప్రభుత్వంలో తాము చేసిన అప్పుల్లో మెజారిటీ వాటా (రూ. 2.73 లక్షల కోట్లు) నేరుగా డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లోకి చేరిందని తెలిపారు. చంద్రబాబు ఈ రెండేళ్లలోనే రూ. 3.52 లక్షల కోట్ల అప్పు చేశారని... ఈ నిధులన్నీ ఎవరి జేబుల్లోకి వెళుతున్నాయని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలు చెత్తబుట్టలోకి వెళ్లాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రగతిని తిరోగమనంలోకి నెట్టారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు.

**రాజధాని లేకుండా చేయడమే చంద్రబాబు లక్ష్యం**

రాజధాని విషయంలో తమ పార్టీ ఒక స్పష్టమైన, ఆచరణాత్మకమైన ప్రణాళికతో ఉందని వైసీపీ అధినేత జగన్ అన్నారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గ కేడర్ సమావేశంలో పాల్గొన్న ఆయన, అమరావతి ప్రాజెక్టును ఒక 'దోపిడీ గని'గా అభివర్ణిస్తూ 'మావిగన్' ప్రతిపాదనపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయడమే చంద్రబాబు లక్ష్యమని జగన్ ఆరోపించారు. కేవలం కాంట్రాక్టుల ద్వారా కమీషన్లు దండుకోవడానికే అమరావతిని తెరపైకి తెచ్చారని, ఇది ప్రజలను మోసం చేయడమేనని మండిపడ్డారు. రాజధానికి సంబంధించి ఆయన రెండు ప్లాన్లను సూచించారు. విశాఖపట్నంను పరిపాలనా రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా, అమరావతిని శాసన రాజధానిగా ఉంచడాన్ని మంచి ఆప్షన్ గా చెప్పారు. ఒకవేళ వికేంద్రీకరణ వద్దనుకుంటే... మచిలీపట్నం, విజయవాడ, గుంటూరులతో కూడిన 110 కిలోమీటర్ల కారిడార్‌ను (మావిగన్) రాజధానిగా అభివృద్ధి చేయాలని సూచించారు. అమరావతి కోసం రూ. 2 లక్షల కోట్లు ఖర్చు చేసే బదులు, అందులో కేవలం 10 శాతం పెడితే 'మావిగన్' ప్రాంతంలో అద్భుతమైన మౌలిక వసతులు కల్పించవచ్చని జగన్ వివరించారు. హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లో చదరపు అడుగు ధర రూ. 4,500 ఉంటే, అమరావతిలో రూ. 14,000 కట్టబెడుతున్నారని, ఇది అతిపెద్ద దోపిడీ అని ఆయన ధ్వజమెత్తారు. అభివృద్ధి కేవలం ఒకే చోట కేంద్రీకృతం కాకూడదని, అమరావతి వెనుక ఉన్నది కేవలం సంపన్నుల ప్రయోజనాలేనని జగన్ తన కేడర్‌కు వివరించారు.

## చంద్రబాబుతో ప్రపంచ బ్యాంక్ బృందం భేటీ

అమరావతి, ఏప్రిల్ 8 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, రాష్ట్రానికి గ్రోత్ ఇంజిన్‌గా మారనుందని ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. బుధవారం నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమైన ప్రపంచ బ్యాంక్ బృందం.. రాజధాని నిర్మాణ పనుల పురోగతిపై ప్రశంసలు కురిపించింది. అమరావతిలో కల్పిస్తున్న మౌలిక సదుపాయాలు, ఐటీ, విద్యుత్ రంగాల్లో చేపట్టిన సంస్కరణలు అంతర్జాతీయంగా భారీ పెట్టుబడులను ఆకర్షిస్తాయని ప్రతినిధి బృందం పేర్కొంది. ఈ అభివృద్ధి కారణంగా అమరావతి భవిష్యత్తులో వాణిజ్య కార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రపంచ బ్యాంక్ బృందం అభిప్రాయాలపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, తమ ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. ప్రపంచ స్థాయి రాజధానిని నిర్మించడంతో పాటు, రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఇందుకోసం రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి అమరావతి ఒక చోదక శక్తిగా ఉపయోగపడుతుందని సీఎం వివరించారు.

## 'మావిగన్' లేకపోతే 'అయోధ్య'

**మీ ఇష్టమున్న పేరు పెట్టుకోండి.. మాజీమంత్రి పేర్ని నాని సెటైర్లు**

తాడేపల్లి, ఏప్రిల్ 8 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని వ్యవహారం, ఏబీఎన్ రాధాకృష్ణ వ్యాఖ్యలపై మాజీ మంత్రి, వైసీపీ పేర్ని నాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కృష్ణా జిల్లా ముస్తాబాద్‌లో జరిగిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, అటు రాజధాని అంశంపై, ఇటు మీడియా సంస్థల తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ప్లాన్ తప్పు అయితే నిరూపించాలని పేర్ని నాని సవాల్ విసిరారు. వందేళ్లయినా పూర్తికాని అమరావతి పేరుతో కేవలం దోపిడీ చేస్తున్నారని, రాష్ట్రం అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతోనే జగన్ ఈ కొత్త ప్రతిపాదన తెచ్చారని సమర్థించారు. "ఒకవేళ మావిగన్ నచ్చకపోతే ఆ ప్రాంతానికి అయోధ్య అని పేరు పెట్టుకోండి, కానీ దోపిడీ మాత్రం ఆపండి" అని అన్నారు. ఆడవాళ్లను కించపరిచేలా మాట్లాడినందుకు రాధాకృష్ణ తక్షణమే క్షమాపణలు చెప్పాలని పేర్ని నాని డిమాండ్ చేశారు. కాశీకి వెళ్లి సిగ్గుశరం వదిలేసి వచ్చారా? అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో దాదాపు 4 లక్షల కోట్లు అప్పు చేస్తే ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. వాలంటీర్ల విషయంలో ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎందుకు బయటపెట్టడం లేదని అడిగారు. కాంట్రాక్టర్ల దగ్గర కమీషన్లు దండుకుంటున్నారని ఆరోపించారు. అమరావతిలో రాధాకృష్ణ 'బ్యాచ్' ఎంత పెట్టుబడి పెట్టిందో చెప్పాలని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ అప్పుల్లో భారీ తేడా

**గవర్నర్ జోక్యం చేసుకోవాలి: బొత్స**

విశాఖపట్నం, ఏప్రిల్ 8 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అప్పుల విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ తప్పుడు, అసంపూర్ణ సమాచారాన్ని శాసనమండలికి సమర్పించిందని మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఈ మేరకు ఆయన గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు బుధవారం ఒక లేఖ రాశారు. ఫిబ్రవరిలో జరిగిన మండలి సమావేశాల్లో ఓ ప్రశ్నకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఇచ్చిన సమాధానంలో వాస్తవ అప్పుల వివరాలు పూర్తిగా లేవని, గణాంకాలను తక్కువ చేసి చూపారని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. ఈ లేఖ కాపీని వైసీపీ మీడియాకు విడుదల చేసింది. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం ప్రకారం, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం అప్పులు రూ. 60,485 కోట్లుగా పేర్కొన్నారని, అయితే కాగ్ ఆడిట్ ప్రకారం వాస్తవ నికర అప్పులు రూ. 81,082 కోట్లుగా ఉన్నాయని బొత్స వివరించారు. ఈ రెండింటి మధ్య రూ. 20,500 కోట్లకు పైగా తేడా ఉందని, దీనికి సరైన కారణాలు కనిపించడం లేదని తెలిపారు. ఆర్‌బీఐ నుంచి తీసుకున్న 'వేజ్ అండ్ మీన్స్ అడ్వాన్సులు', పబ్లిక్ అకౌంట్ కింద ఉన్న డిపాజిట్లు, రిజర్వ్ ఫండ్స్ వంటి ముఖ్యమైన అంశాలను ప్రభుత్వం తన లెక్కల్లో కలపలేదని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా, 2025-26లో ఆఫ్-బడ్జెట్ రుణాలు ఏవీ లేవని ప్రభుత్వం చెప్పడం కూడా సరికాదన్నారు. మార్క్‌ఫెడ్, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ల ద్వారా ప్రభుత్వ గ్యారెంటీతో రుణాలు సమీకరించారని, ఇవి కూడా ప్రభుత్వ అప్పుల కిందకే వస్తాయని గుర్తుచేశారు. శాసనసభకు తప్పుడు సమాచారం ఇవ్వడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని బొత్స అన్నారు. ఈ విషయంలో గవర్నర్ జోక్యం చేసుకుని, తప్పుడు సమాధానాన్ని ఉపసంహరించుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. అలాగే, ఈ తేడాలకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాధనానికి సంబంధించిన విషయాల్లో పారదర్శకత చాలా అవసరమని బొత్స తన లేఖలో స్పష్టం చేశారు.

## మూడేళ్లలో అమరావతి నిర్మాణం ఎలా సాధ్యం?

**ఏపీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం**



తాడేపల్లి, ఏప్రిల్ 8 (ఈవార్తలు): అమరావతి రాజధాని నిర్మాణం ఆచరణ సాధ్యం కాదని, అది కేవలం కూటమి ప్రభుత్వానికి ఏటీఎంలా మారిందని వైసీపీ సీనియర్ నేత తమ్మినేని సీతారాం విమర్శించారు. తాడేపల్లిలో జగన్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన, రాజధాని విషయంలో ప్రస్తుత ప్రభుత్వ తీరును తప్పుబట్టారు. అమరావతి నిర్మాణానికి రూ. 2 లక్షల కోట్లు అవసరమని, కేవలం మూడేళ్లలో ఇది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అసలు రాజధానిగా అమరావతిని ఎంపిక చేయడమే ఒక పెద్ద తప్పని ఆయన వ్యాఖ్యానించారు. జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' ప్లాన్‌కు తమ్మినేని పూర్తి మద్దతు తెలిపారు. అతి తక్కువ ఖర్చుతో అద్భుతమైన మౌలిక వసతులు కల్పించే అవకాశం ఉన్న ఈ కారిడార్‌ను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారీ నిధులు ఎక్కడి నుంచి తెస్తారో చెప్పకుండా అమలు సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆచరణాత్మకమైన పరిష్కారాల వైపు వెళ్లాలని ఆయన సూచించారు.

# ఇరాన్ ఒప్పందం ఉల్లంఘిస్తే తీవ్ర పరిణామాలు


**అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్చరిక**

వాషింగ్టన్: అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతల తర్వాత కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం గంటల వ్యవధిలోనే ఒత్తిడికి గురవుతోందని అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది చాలా 'బలహీనమైన ఒప్పందం' అని, టెహ్రాన్‌లోని అంతర్గత విభేదాల కారణంగా ఇది ఏ క్షణంలోనైనా విఫలం కావచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ ఇరాన్ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. బుడాపెస్ట్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ వాన్స్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ తమను నిజాయతీగా చర్చలు జరపమని ఆదేశించారని, అయితే తమ సహనానికి కూడా ఒక హద్దు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. "వారు నిజాయతీగా చర్చలు జరిపితే, మేం కచ్చితంగా ఒక విస్తృత ఒప్పందాన్ని కుదుర్చుకోగలుగుతాం. కానీ, వారు అబద్ధాలు చెప్పినా, మోసం చేసినా.. దాని పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి" అని వాన్స్ హెచ్చరించారు. అవసరమైతే తమ వద్ద స్పష్టమైన సైనిక, దౌత్య, అసాధారణ ఆర్థిక పరపతి ఉందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతానికి ఈ సంధి ఒక స్వల్పమైన దౌత్యపరమైన అవకాశాన్ని మాత్రమే కల్పించిందని, చర్చల్లో ఇరాన్ ఎలా వ్యవహరిస్తుందనే దానిపైనే తదుపరి దశ ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కొన్ని గంటల క్రితమే కుదిరిన ఈ ఒప్పందం కేవలం ఘర్షణలకు తాత్కాలిక విరామం మాత్రమేనని, దీని భవిష్యత్తుపై అనిశ్చితి కొనసాగుతోందని ఆయన అన్నారు. "ఈ ఒప్పందం కుదిరి కేవలం 8 నుంచి 12 గంటలు మాత్రమే అయింది. అందుకే ఇది బలహీనమైన సంధి అని నేను చెబుతున్నాను" అని వాన్స్ వివరించారు. ప్రపంచ వాణిజ్యానికి ఆటంకం కలిగిస్తున్న కీలకమైన నౌకా మార్గాలను తిరిగి తెరవాలని, ఘర్షణ పూరిత చర్యలను నిలిపివేయాలని అమెరికా ఇచ్చిన అల్టిమేటం తర్వాతే ఈ ఒప్పందం కుదిరింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు చర్చలు జరిపినట్లు వాన్స్ తెలిపారు. "కీలక జలమార్గాలను తెరవండి, మేం కాల్పుల విరమణకు సిద్ధమవుతాం అని అధ్యక్షుడు స్పష్టంగా చెప్పారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం, వ్యూహాత్మక జలమార్గాల గుండా నౌకల రాకపోకలను పునరుద్ధరించడానికి ఇరాన్ అంగీకరించింది. దీనికి బదులుగా, అమెరికా, దాని మిత్రదేశాలు సైనిక దాడులను నిలిపివేశాయి. అయితే, కాల్పుల విరమణకు ముందే అమెరికా తన సైనిక లక్ష్యాన్ని సాధించిందని వాన్స్ స్పష్టం చేశారు. "ఇరాన్ సైనిక శక్తిని నిర్వీర్యం చేయడమే మా అధ్యక్షుడి లక్ష్యం. ఆ లక్ష్యం ఇప్పటికే నెరవేరింది" అని అన్నారు. ఒప్పందం కుదిరినప్పటికీ, ఇరాన్ నాయకత్వంలోని భిన్నాభిప్రాయాలు పరిస్థితిని క్లిష్టతరం చేస్తున్నాయని వాన్స్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఇరాన్‌లో కొందరు ఈ ఒప్పందాన్ని సానుకూలంగా స్వాగతిస్తుంటే, మరికొందరు మాత్రం మేం సాధించిన దాని గురించి, ఒప్పందం స్వభావం గురించి పూర్తిగా అబద్ధాలు చెబుతున్నారు. కాల్పుల విరమణపైనా తప్పుడు ప్రచారం చేస్తున్నారు" అని ఆరోపించారు. ఈ అంతర్గత వైరుధ్యాలే సంధి బలహీనంగా ఉండటానికి ప్రధాన కారణమని, జాగ్రత్తగా వ్యవహరించకపోతే అది విఫలమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



## న్యాయ పరిశీలనలో ముస్లింల ఓట్లు

**ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం**



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఆయా నియోజకవర్గాల్లో పెద్ద మొత్తంలో ముస్లింల పేర్లను న్యాయ పరిశీలన జాబితాలో ఉంచడంపై మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సంషేర్‌గంజ్ నియోజకవర్గంలో 55 శాతం మంది ముస్లింలు, మోతాబరిలో 54.2 శాతం, మణిక్‌చక్‌లో 50 శాతం, బెర్హాంపూర్‌లో 61.6 శాతం మంది ముస్లింల పేర్లు పరిశీలన జాబితాలో నిలిచిపోయాయని ఆరోపించారు. రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గాల్లో లక్షలాది మంది ముస్లింల ఓటు హక్కును ప్రశ్నార్థకంగా మార్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి ఓటు హక్కు విషయమై 'ఫారెనర్స్ ట్రైబ్యునల్' ఎప్పుడు నిర్ణయం తీసుకుంటుందో తెలియని పరిస్థితి నెలకొందని అన్నారు. ఆ నిర్ణయం వెలువడే వరకు వారు ఓటు వేయలేరని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల లోపు 'ఫారెనర్స్ ట్రైబ్యునల్' సభ్యులను ఏర్పాటు చేసి త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని కోరారు. తమ పేర్లు గల్లంతయ్యాయని లక్షలాది మంది ఓటర్లు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఎన్నికలకు ముందే నిర్ణయం తీసుకోవడం ద్వారా అందరికీ ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

## వాట్సాప్‌లో యూజర్‌నేమ్ ఫీచర్

న్యూఢిల్లీ: ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సాప్ ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న 'యూజర్‌నేమ్' ఫీచర్‌ను ఎట్టకేలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇకపై ఫోన్ నంబర్ పంచుకోవాల్సిన అవసరం లేకుండానే ఇతరులతో చాట్ చేయడానికి, కాల్స్ చేయడానికి ఈ ఫీచర్ వీలు కల్పిస్తుంది. ప్రస్తుతానికి ఎంపిక చేసిన కొంతమంది ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు మాత్రమే ఈ అప్‌డేట్‌ను విడుదల చేసినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో దశలవారీగా అందరికీ అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. ఈ కొత్త ఫీచర్ ద్వారా యూజర్లు తమ ప్రొఫైల్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఒక ప్రత్యేకమైన యూజర్‌నేమ్‌ను క్రియేట్ చేసుకోవచ్చు. ఈ యూజర్‌నేమ్ 3 నుంచి 35 అక్షరాల మధ్య ఉండాలి. కేవలం ఇంగ్లీష్ చిన్న అక్షరాలు, అంకెలు (0-9), చుక్క (.), అండర్‌స్కోర్ మాత్రమే వాడటానికి అనుమతి ఉంటుంది. వాట్సాప్ చాలా సంవత్సరాలుగా ఈ ఫీచర్‌పై పనిచేస్తోంది. యూజర్ల ప్రైవసీని పెంచడమే దీని ప్రధాన లక్ష్యం. ఇప్పటికే టెలిగ్రామ్ వంటి యాప్‌లలో ఈ సౌకర్యం అందుబాటులో ఉంది. ఈ ఫీచర్ రాకతో, తెలియని వ్యక్తులతో లేదా వ్యాపార అవసరాల కోసం ఫోన్ నంబర్‌ను పంచుకోవాల్సిన ఇబ్బంది తప్పుతుంది. ప్రస్తుతం పరిమిత సంఖ్యలో యూజర్లకు మాత్రమే ఈ ఫీచర్ కనిపిస్తోంది. యూజర్లు తమ యాప్‌ను అప్‌డేట్ చేసుకుని, ప్రొఫైల్ సెట్టింగ్స్‌లో ఈ ఫీచర్ వచ్చిందో లేదో చెక్ చేసుకోవచ్చు. అయితే ఈ విడుదలపై మాతృసంస్థ మెటా గానీ, వాట్సాప్ గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

## మేం టోల్ వసూలు చేయం: ఒమన్

టెహ్రాన్: హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై టోల్ ఫీజు వసూలు చేసే ప్రణాళికలు ఏమీ లేవని గల్ఫ్ దేశం ఒమన్ స్పష్టం చేసింది. టోల్ ఫీజు వసూలు చేయాలన్న ఇరాన్ ప్రతిపాదనను ఒమన్ వ్యతిరేకించింది. ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల పాటు కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికాకు ఇరాన్ పంపిన 10 డిమాండ్లలో టోల్ ఫీజు వసూలు చేయడం కూడా ఉంది. గల్ఫ్ దేశాల నుంచి చమురు రవాణాకు కీలక ప్రాంతం హర్మూజ్ జలసంధి. 53 కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఈ జలసంధికి ఇరువైపులా ఇరాన్, ఒమన్ దేశాలు ఉంటాయి. ఇప్పటి వరకు ఈ మార్గం గుండా వెళ్లే నౌకలకు ఎలాంటి టోల్ ఫీజు లేదు. ప్రస్తుత యుద్ధం నేపథ్యంలో ఇరాన్ టోల్ ఫీజు ప్రతిపాదన చేసింది. దీనికి అమెరికా కూడా అంగీకరించింది. ఈ క్రమంలో హర్మూజ్ జలసంధికి ఇరువైపులా ఉన్న ఇరాన్, ఒమన్ దేశాలు టోల్ ఫీజు విధించే అంశంపై చర్చలు జరిపాయి. అనంతరం, ఒమన్ రవాణా శాఖ మంత్రి సయీద్ బిన్ హమూద్ బిన్ సయీద్ ఆల్ మాట్లాడుతూ, నౌకలపై టోల్ ఫీజు విధించబోమని హామీ ఇచ్చే ఒప్పందాలపై సంతకం చేసినట్లు చెప్పారు. ఈ వ్యూహాత్మక కీలక ప్రదేశంలో స్వేచ్ఛాయుత, సురక్షితమైన నౌకాయానాన్ని కొనసాగించడానికి తమ దేశం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## ఇరాన్‌లో పాలన మారింది ఇక కలిసి పనిచేస్తాం: ట్రంప్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అత్యంత ఫలవంతమైన రీతిలో పాలన మార్పు జరిగిందని, ఆ దేశంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన 'ట్రూత్ సోషల్' వేదికగా ఆయన ఈ మేరకు ఒక పోస్ట్ చేశారు. ఇరాన్ ఇకపై యురేనియం శుద్ధి చేయదని ట్రంప్ తన పోస్టులో స్పష్టం చేశారు. భూమిలో లోతుగా పాతిపెట్టిన అణు ధూళిని తవ్వి తొలగించేందుకు ఇరాన్‌కు అమెరికా సహాయం చేస్తుందని తెలిపారు. ఇరాన్ ప్రస్తుతం అత్యంత కచ్చితమైన శాటిలైట్ నిఘాలో ఉందని, దాడి జరిగిన నాటి నుంచి అక్కడ ఏదీ మార్పు చెందలేదని పేర్కొన్నారు. తమ స్పేస్ ఫోర్స్ ఉపగ్రహాలు ఇరాన్ పై ఓ కన్నేసి ఉంచాయని వివరించారు. ఇరాన్‌తో టారిఫ్‌లు, ఆంక్షల ఉపశమనంపై తాము చర్చలు జరుపుతామని కూడా ట్రంప్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఉన్న 15 డిమాండ్లలో చాలా వాటికి ఇప్పటికే అంగీకారం కుదిరిందని ఆయన తన పోస్టులో వివరించారు.

## ఇరాన్ కీలక ఆయిల్ రిఫైనరీపై దాడి

టెహ్రాన్: కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినట్లు వార్తలు వెలువడిన కొన్ని గంటలకే, లావన్ ద్వీపంలోని ఆయిల్ రిఫైనరీపై దాడి జరిగినట్లు ఇరాన్ తెలిపింది. ఇక్కడి చమురు శుద్ధి కేంద్రాన్ని శత్రువులు లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. టెహ్రాన్ కూడా ప్రతీకార దాడులు నిర్వహించింది. యూఏఇ, కువైట్‌లపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడింది. నేషనల్ ఇరానియన్ ఆయిల్ రిఫైనింగ్ అండ్ డిస్ట్రిబ్యూషన్ (ఎన్ఐఓఆర్డీసీ) కంపెనీ లావన్‌పై దాడిని ధ్రువీకరించింది. ఈ దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించింది. చెలరేగిన మంటలను అదుపు చేయడానికి వెంటనే భద్రతా మరియు అగ్నిమాపక సిబ్బంది బృందాలు రంగంలోకి దిగాయి. క్షేత్రస్థాయిలోని సిబ్బందిని సకాలంలో తరలించడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ఎన్ఐఓఆర్డీసీ తెలిపింది. ఇరాన్ జాతీయ ఇంధన సరఫరా మరియు పంపిణీలో ఎలాంటి ఇబ్బంది లేదని ఎన్ఐఓఆర్డీసీ స్పష్టం చేసింది. అయితే పౌరులు ఇంధన వినియోగాన్ని నియంత్రించుకోవాలని, అనవసర ప్రయాణాలను నివారించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని కోరింది. కువైట్‌లోని పలు చమురు, విద్యుత్ క్షేత్రాలపై దాడులు జరిగాయి. దాదాపు 28 ఇరాన్ డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకుందని కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. చమురు శుద్ధి కేంద్రాలు, విద్యుత్ ప్లాంట్లపై డ్రోన్ దాడులు జరగడంతో భారీ నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. యూఏఈలోని కొన్ని ప్రాంతాలపై కూడా క్షిపణి దాడులు జరిగాయి.

## దాడికి 90 నిమిషాల ముందు యూటర్న్

**ప్రపంచానికి ఊరటనిచ్చిన ట్రంప్ నిర్ణయం**

వాషింగ్టన్: గడువు ముగుస్తుండటంతో అగ్రరాజ్యం అమెరికా, ఇరాన్ మధ్య పోరు ఖాయమని ప్రపంచమంతా బిగబట్టిన ఊపిరితో చూస్తున్న వేళ... డొనాల్డ్ ట్రంప్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌పై సైనిక దాడికి తాను నిర్దేశించుకున్న గడువుకు సరిగ్గా 90 నిమిషాల ముందు, ఆ ఆదేశాలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించి పెను సంక్షోభాన్ని నివారించారు. ఈ కీలక నిర్ణయంతో పశ్చిమాసియాలో కమ్ముకున్న యుద్ధ మేఘాలు ప్రస్తుతానికి వీడిపోవడంతో ప్రపంచ దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. తెరవెనుక పాకిస్థాన్ సాగించిన దౌత్యం ఫలితంగానే ఈ 'ద్వైపాక్షిక కాల్పుల విరమణ' సాధ్యమైందని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. రెండు వారాల పాటు ఈ విరామం ఉంటుందని, అయితే ఇందుకు ప్రతిగా ప్రపంచ చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని ఇరాన్ తక్షణమే తెరవాలని ఆయన షరతు విధించారు. "మా సైనిక లక్ష్యాలు ఇప్పటికే నెరవేరాయి. ఇరాన్‌తో దీర్ఘకాలిక శాంతి కోసం ఇది ఒక ముందడుగు" అని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ ప్రకటనకు ముందు తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అమెరికా దాడికి సిద్ధమైందన్న సంకేతాలతో యావత్ ప్రపంచం భయాందోళనలకు గురైంది. ఈ క్లిష్ట సమయంలో పాకిస్థాన్ జరిపిన మంత్రాంగం కీలక పాత్ర పోషించినట్లు దౌత్య వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ట్రంప్ ప్రతిపాదనపై ఇరాన్ కూడా సానుకూలంగా స్పందించింది. "మాపై దాడులు ఆగితే, మా రక్షణ చర్యలను నిలిపివేస్తాం" అని ఇరాన్ విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ రెండు వారాల విరామానికి ఇజ్రాయెల్ కూడా అంగీకరించినట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. చర్చల కోసం ఇరాన్ నుంచి తమకు 10-సూత్రాల ప్రతిపాదన అందిందని, ఇది శుభపరిణామమని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతానికి దాడులు ఆగడంతో దౌత్యానికి మార్గం సుగమమైనప్పటికీ, ఇరాన్ అణు కార్యక్రమం, అమెరికా విధించిన కఠిన ఆంక్షల వంటి అనేక వివాదాస్పద అంశాలపై ఇరు దేశాల మధ్య తీవ్ర విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

## భారీగా తగ్గిన చమురు ధరలు

న్యూఢిల్లీ: ఇరాన్‌పై తలపెట్టిన సైనిక దాడులను రెండు వారాల పాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో అంతర్జాతీయ మార్కెట్లపై తక్షణ ప్రభావం పడింది. గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ భయాలు తాత్కాలికంగా తొలగిపోవడంతో ముడి చమురు ధరలు భారీగా పడిపోయాయి. స్టాక్ మార్కెట్లు సానుకూలంగా స్పందించాయి. గత కొన్ని వారాలుగా హర్మూజ్ జలసంధి వద్ద నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా పెరుగుతూ వచ్చిన ముడి చమురు ధరలు, ట్రంప్ ప్రకటనతో 100 డాలర్ల కంటే దిగువకు పడిపోయాయి. హర్మూజ్ జలసంధిని ఇరాన్ తిరిగి తెరవాలనే షరతుపై దాడులను నిలిపివేస్తున్నట్లు ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' లో వెల్లడించారు. ఈ వార్తతో పెట్టుబడిదారులలో నెలకొన్న ఆందోళన తగ్గింది. అమెరికా ప్రధాన సూచీల ఫ్యూచర్స్ 2 శాతానికి పైగా పెరిగాయి. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో ఇరాన్ ఆంక్షలు విధించడంతో సరఫరాపై ఆందోళనలు పెరిగి ధరలు పెరిగాయి.

# లెబనాన్‌పై దాడులు ఆపాలి

**లేకపోతే ఒప్పందం నుంచి వైదొలగుతాం: ఇరాన్.. హర్మూజ్ మళ్లీ మూసివేత**



టెహ్రాన్: మధ్యప్రాచ్యంలో శాంతి స్థాపన కోసం అమెరికా చొరవతో కుదిరిన రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ప్రమాదంలో పడింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగించడమే దీనికి కారణమైంది. ఇజ్రాయెల్ చర్యలను తీవ్రంగా పరిగణించిన ఇరాన్, ఒప్పందం నుంచి వైదొలుగుతామని హెచ్చరించింది. అంతేకాకుండా, ప్రపంచ చమురు రవాణాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధిని మరోసారి దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించి సంచలనం సృష్టించింది. ఈ పరిణామంతో పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చొరవతో ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య రెండు వారాల పాటు యుద్ధ విరమణ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం, హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రాకపోకలను సురక్షితంగా కొనసాగించడం ప్రధాన షరతు. అయితే, ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని, అక్కడి హెజ్బొల్లా బలగాలపై తమ సైనిక చర్యలు యథావిధిగా కొనసాగిస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పష్టం చేశారు. అన్నట్లుగానే, లెబనాన్‌పై, ముఖ్యంగా రాజధాని బీరట్‌లోని నివాస, వాణిజ్య ప్రాంతాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులను తీవ్రతరం చేసింది. ఈ దాడుల్లో డజన్ల కొద్దీ పౌరులు మరణించగా, వందలాది మంది తీవ్రంగా గాయపడ్డారు. ఇజ్రాయెల్ చర్యలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని బాహాటంగా ఉల్లంఘించడమేనని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి మండిపడ్డారు. దాడులు ఇలాగే కొనసాగితే తాము ఒప్పందం నుంచి వైదొలగాల్సి వస్తుందని తీవ్రంగా హెచ్చరించారు. మరోవైపు, తమ అనుమతి లేకుండా హర్మూజ్ జలసంధిలోకి ప్రవేశించే ఏ నౌకనైనా ధ్వంసం చేస్తామని ఇరాన్ సాయుధ దళాలు ప్రకటించాయి. ఇటీవల ఇరాన్ ఈ జలసంధిని నిరోధించినప్పుడు అంతర్జాతీయంగా చమురు ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే. తాజా పరిణామం మళ్లీ అదే ఆందోళనకు దారితీస్తోంది. వాస్తవానికి పాకిస్థాన్‌లో శాశ్వత శాంతి చర్చలు జరపాలని ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. అయితే, హర్మూజ్ జలసంధిపై పూర్తి సైనిక ఆధిపత్యం తమకే ఉండాలని, దాని ద్వారా ప్రయాణించే నౌకల నుంచి రుసుము వసూలు చేసే హక్కు కల్పించాలని ఇరాన్ కొత్త డిమాండ్లను తెరపైకి తెచ్చింది. కానీ అమెరికా, ఇజ్రాయెల్ మాత్రం ప్రస్తుత కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని స్పష్టం చేస్తున్నాయి. ఈ పరస్పర విరుద్ధ వైఖరులతో మధ్యప్రాచ్యంలో శాంతి ప్రయత్నాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. హర్మూజ్ జలసంధి భద్రతపై ప్రపంచ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# రాఘవ్ చద్దా కొత్త పార్టీ?

**ఆసక్తిగా ఇన్‌స్టా పోస్ట్**



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) యువ నేత, రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా సొంత రాజకీయ పార్టీ పెట్టబోతున్నారా? అవుననే సంకేతాలిస్తూ ఆయన చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీలో నెలకొన్న విభేదాల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. వివరాల్లోకి వెళితే, రాఘవ్ చద్దా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో బుధవారం ఓ వీడియోను షేర్ చేశారు. అందులో ఓ యువకుడు మాట్లాడుతూ.. "రాఘవ్ చద్దా ఏదైనా పార్టీలో చేరడం కన్నా, సొంతంగా 'జెన్ జెడ్ పార్టీ' వంటి పేరుతో యువతతో కూడిన పార్టీని ప్రారంభిస్తే మంచిది. యువత మద్దతు మీకు ఉంటుంది, మీరే గెలుస్తారు" అని సలహా ఇచ్చాడు. ఈ వీడియోను రాఘవ్ చద్దా రీపోస్ట్ చేస్తూ, "ఆసక్తికరమైన ఆలోచన" అని ఓ ఎమోజీతో కలిపి వ్యాఖ్యానించారు. ఇటీవల రాజ్యసభలో ఆప్ డిప్యూటీ నేత పదవి నుంచి చద్దాను తొలగించినప్పటి నుంచి పార్టీతో ఆయనకు దూరం పెరుగుతోంది. పంజాబ్ సమస్యలను ప్రస్తావించడం లేదని, బీజేపీ పట్ల మెతక వైఖరి అవలంబిస్తున్నారని కొందరు ఆప్ నేతలు ఆరోపించారు. మరోవైపు, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ సైతం చద్దా 'రాజీ పడ్డారని' చేసిన వ్యాఖ్యలు ఈ వివాదాన్ని మరింత తీవ్రతరం చేశాయి. ఈ క్రమంలో చద్దా సొంత పార్టీ వైపు చూస్తున్నారా లేక బీజేపీలో చేరతారా అనే ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే, కొత్త పార్టీ స్థాపనకు బలమైన కేడర్, నిధులు, క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణం అవసరమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వచ్చే ఏడాది పంజాబ్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆప్‌లో ఈ అంతర్గత పోరు పార్టీకి నష్టం కలిగించే అవకాశం ఉంది. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా పరోక్ష వ్యాఖ్యలు చేస్తున్న చద్దా తదుపరి అడుగు ఏంటనేది ఆసక్తికరంగా మారింది. ఆయన రాజ్యసభ సభ్యత్వం 2028 సెప్టెంబర్ వరకు ఉంది.



# నెతన్యాహుపై ఇజ్రాయెల్‌లో తిరుగుబాటు!

జెరూసలేం: ఇరాన్‌తో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును తీవ్ర రాజకీయ సంక్షోభంలోకి నెట్టింది. ఇరాన్‌ను సమూలంగా దెబ్బతీస్తానని ప్రకటించి, మధ్యలోనే యుద్ధ విరమణకు అంగీకరించడంపై సొంత దేశంలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇది 'చారిత్రక తప్పిదం' అంటూ ప్రతిపక్షాలు, రక్షణ రంగ నిపుణులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఒప్పందం ఇజ్రాయెల్ చరిత్రలోనే అతిపెద్ద రాజకీయ వైఫల్యమని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. సైన్యం సమర్థవంతంగా పోరాడుతున్నప్పటికీ, నెతన్యాహు తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల దేశం ఈ దుస్థితికి చేరిందని వారు మండిపడుతున్నారు. ఇరాన్‌పై పూర్తిస్థాయి విజయం సాధించకుండానే వెనక్కి తగ్గడం, ఆ దేశ దూకుడుకు తలొంచడమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ విరామ సమయాన్ని ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలను పునరుద్ధరించుకోవడానికి వాడుకుంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒత్తిడి వల్లే నెతన్యాహు ఈ నిర్ణయం తీసుకున్నారని, దీనివల్ల ఇజ్రాయెల్ స్వతంత్ర రక్షణ విధానం దెబ్బతిన్నదని రక్షణ రంగ నిపుణులు విమర్శిస్తున్నారు. ఒప్పందం నుంచి హెజ్బుల్లాను మినహాయించినప్పటికీ, ఇరాన్‌కు ఊరటనివ్వడం వల్ల ప్రాంతీయంగా ముప్పు తొలగిపోదని స్పష్టం చేస్తున్నారు. గత కొన్ని వారాలుగా బాంబు షెల్టర్లలోనే తలదాచుకుంటున్న ప్రజల్లో ఈ ఒప్పందంపై తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. టెల్ అవీవ్ సహా పలు నగరాల్లో నెతన్యాహు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నిరసనలు జరుగుతున్నాయి. సొంత కేబినెట్‌లోని మంత్రులు కూడా ఈ ఒప్పందంపై అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తుండటంతో నెతన్యాహు ప్రభుత్వం పడిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు వారాల విరామం తర్వాత యుద్ధం మళ్లీ మొదలవుతుందా లేక ప్రభుత్వం కూలిపోతుందా అన్నది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

# వెంటనే ఇరాన్‌ను వీడండి


**భారతీయులకు కేంద్రం అడ్వైజరీ**



న్యూఢిల్లీ: ఇరాన్ దేశంలోని భారతీయులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి కీలక అడ్వైజరీ జారీ చేసింది. ఆ దేశం నుంచి వెంటనే బయటపడాలని భారత పౌరులకు సూచించింది. ఈ మేరకు ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్టును పంచుకుంది. కేంద్ర ప్రభుత్వం సూచనల ఆధారంగా ఇరాన్ నుంచి బయటపడాలని కోరింది. ఇరాన్‌లోని రాయబార కార్యాలయాన్ని సంప్రదించకుండా లేదా వారితో సమన్వయం చేసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావొద్దని హెచ్చరించింది. ఈ మేరకు రాయబార కార్యాలయం అత్యవసర సమయంలో సంప్రదించేందుకు ఫోన్ నెంబర్లను ఇచ్చింది. ౦989128109115; ౦989128109109; ౦989128109102; ౦989932179359 నంబర్లను షేర్ చేసింది. అమెరికా, ఇరాన్ దేశాలు రెండు వారాలు కాల్పుల విరమణకు అంగీకరించిన విషయం తెలిసిందే. నిన్న ఇరాన్‌కు ట్రంప్ గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలో నిన్న కూడా కేంద్రం అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని, ఇళ్లలోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్థుల భవనాలకు దూరంగా ఉండాలని సూచించింది. తాజాగా కాల్పుల విరమణ నేపథ్యంలో మరోసారి అడ్వైజరీ జారీ చేసింది.


లవ్లీ చిత్రం


అవనీత్ కౌర్




# అల్లు వారి 'రాకా'!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కలయికలో రాబోతున్న భారీ ప్రాజెక్టు టైటిల్ రాకాగా అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో పాటు సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు. పోస్టర్‌లో అల్లు అర్జున్ సరికొత్త, వైల్డ్ లుక్‌లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఆయన తీవ్రమైన చూపు, భిన్నమైన గెటప్ సినీ ప్రియులలో ఉత్సాహాన్ని నింపింది. ఈ చిత్రం గురించిన వార్తలు చాలా కాలంగా ప్రచారంలో ఉన్నప్పటికీ, టైటిల్ ఫస్ట్ లుక్ విడుదల కావడంతో అధికారికంగా ప్రాజెక్టుకు బీజం పడింది. అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్ విడుదల కావడం గమనార్హం.



# బాక్సాఫీస్‌ను షేక్ చేయబోతున్న అనీత్ పడ్డా

'సైయారా' సినిమాతో కుర్రకారు మనసు దోచుకున్న యంగ్ బ్యూటీ అనీత్ పడ్డా. మొదటి చిత్రంతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుని ఓవర్ నైట్ స్టార్‌గా మారిన ఈ భామ ఇప్పుడు బాక్సాఫీస్ వద్ద తన అసలు సిసలు విశ్వరూపాన్ని చూపించేందుకు సిద్ధమవుతోంది.



మోహిత్ సూరి దర్శకత్వంలో 'వాణి బాత్రా'గా మెప్పించిన ఈ అమ్మడు, ఇప్పుడు హారర్-కామెడీ జోనర్‌లోకి అడుగుపెడుతూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. మడాక్ హారర్ కామెడీ యూనివర్స్ లో భాగంగా వస్తున్న 'శక్తి శాలిని' చిత్రంలో అనీత్ ఏకంగా డబుల్ రోల్ చేస్తుండటం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమా టైటిల్‌కు తగ్గట్టే అనీత్ పడ్డా ఇందులో 'శక్తి, శాలిని' అనే రెండు భిన్నమైన పాత్రల్లో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. బెంగాలీ జానపద కథల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో.. శక్తి ఒక శక్తివంతమైన రక్షకురాలిగా కనిపిస్తుండగా, శాలిని ఒక భయంకరమైన ఆత్మగా భయపెట్టనుందట. మోసపోయి, దారుణంగా హత్యకు గురైన ఒక మహిళ ఆత్మగా మారి పురుషులపై ఎలా పగ తీర్చుకుంటుంది అనేదే ఈ సినిమా కథ అని తెలుస్తోంది. చెడుపై మంచి సాధించే విజయానికి చిహ్నంగా కాళీ మాత అంశంతో శక్తి పాత్రను తీర్చిదిద్దారట దర్శకుడు ఆదిత్య సర్పోత్దార్. ప్రస్తుతం ముంబైలోని మాధ్ ఐలాండ్‌లో ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నట్లు సమాచారం. పశ్చిమ బెంగాల్‌లోని ఒక చిన్న పట్టణాన్ని తలపించేలా అక్కడ భారీ సెట్ వేశారట. ఆ తర్వాత మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్, దతియా వంటి ప్రాంతాల్లో కీలక షెడ్యూల్స్ జరగనున్నట్లు టాక్. ఈ సినిమాలో విశాల్ జెత్వా, వినీత్ కుమార్ సింగ్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ మూవీని డిసెంబర్ 24, 2026న విడుదల చేయాలని మూవీ మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే అదే రోజున షారుఖ్ ఖాన్, దీపికా పదుకొణెల 'కింగ్' సినిమా కూడా విడుదల కానుండటంతో, 'శక్తి శాలిని' విడుదల తేదీని మార్చే అవకాశం ఉందని సమాచారం. ఏది ఏమైనా, అనీత్ పడ్డా ఈ డబుల్ రోల్‌తో తన కెరీర్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.

# నాకూ లవ్ బ్రేకప్: కృతి శెట్టి

ఉప్పెన' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన కృతి శెట్టి, త్వరలో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమైంది. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ క్రేజీ లవ్ స్టోరీలో కృతి సరసన 'లవ్ టుడే' ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న భారీ స్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఈ జంట తమ వ్యక్తిగత జీవితంలోని బ్రేకప్‌ల గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో కృతి శెట్టి తన లవ్ లైఫ్ గురించి ఓపెన్ అయిపోయింది. "నేను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నాను. కానీ గతంలో నా జీవితంలో ఒకసారి బ్రేకప్ జరిగింది. ఆ విషయం మా అమ్మకు కూడా తెలుసు. ఇక సోషల్ మీడియా విషయానికొస్తే.. ఎవరైనా నా గురించి కావాలని నెగిటివ్‌గా ప్రచారం చేస్తే మాత్రం వెంటనే వారిని బ్లాక్ చేస్తాను" అంటూ క్లారిటీ ఇచ్చింది. కృతి చేసిన ఈ బ్రేకప్ కామెంట్స్ చూసి నెటిజన్లు షాక్ అవుతున్నారు. ఇక హీరో ప్రదీప్ రంగనాథన్ తనదైన స్టైల్‌లో ఫన్నీగా స్పందించాడు. "నేను సింగిల్ అని చెప్పుకోవడానికే గర్వపడతాను. నా జీవితంలో ఒకటి కాదు, చాలా బ్రేకప్‌లు జరిగాయి. నేనైతే ఎవరినీ బ్లాక్ చేయలేదు కానీ, అవతలి వాళ్లే నన్ను బ్లాక్ చేశారు. ముఖ్యంగా నా కాలేజీ రోజుల్లో అమ్మాయిల మెసేజ్‌లకు నేను చాట్‌జీపీటీ కంటే వేగంగా రిప్లై ఇచ్చేవాడిని" అంటూ నవ్వులు పూయించాడు.







# కథనార్ కోసం హైదరాబాద్‌కు అనుష్క?

టాలీవుడ్ జేజమ్మ అనుష్క శెట్టిని వెండితెరపై చూడాలని ఫ్యాన్స్ ఎంతలా ఎదురుచూస్తారో, ఆమెను ప్రమోషన్లలో చూడటం అంతకంటే కష్టమైన పని. సొంత సినిమాలకే పెద్దగా ప్రచారం చేయని స్వీటీ, ఇప్పుడు తన మొదటి మలయాళ చిత్రం 'కథనార్' కోసం హైదరాబాద్ వస్తారన్న వార్త ఫిల్మ్ నగర్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇది నిజంగా సినిమాపై ఉన్న ప్రేమనా లేక కేవలం ప్రచార స్టంటా? అసలు అనుష్క ఈసారి కెమెరా ముందుకు వస్తుందా లేదా అనేది ఇప్పుడు అందరినీ తొలిచేస్తున్న ప్రశ్న. ఒకవేళ అనుష్క నిజంగానే ప్రమోషన్లకు వస్తే మాత్రం అది టాలీవుడ్‌లో ఒక పెద్ద సంచలనమే అవుతుంది. అనుష్క ప్రమోషన్లకు వస్తారన్న వార్త ప్రస్తుతం ఒక ఊహాగానం లాంటిదే. అభిమానులు మాత్రం ఆమెను ఒక్కసారైనా నేరుగా చూడాలని ఆశిస్తున్నారు. మరి జేజమ్మ మనసు మార్చుకుని తన రూల్ బ్రేక్ చేసి వస్తుందో లేదో తెలియాలంటే మరికొన్ని రోజులు ఆగాల్సిందే.


# హైదరాబాద్‌లో గ్లోబల్ బ్యూటీ పూల్ డే

గ్లోబల్ ఐకాన్ ప్రియాంక చోప్రా ప్రస్తుతం -వారణాసి- షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా కోసం తను ఎంతో శ్రమిస్తున్నా... తాజాగా లభించిన విరామ సమయంలో హైదరాబాద్‌లో తన కుటుంబంతో కలిసి సరదాగా గడిపారు. ఈ క్రమంలో పీసీ సోషల్ మీడియాలో షేర్ చేసిన -పూల్ డే- ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. పూల్ డే సెలబ్రేషన్స్‌లో ప్రియాంకతో పాటు భర్త, పాప్ సింగర్ నిక్ జోనాస్, కుమార్తె మాల్తీ మేరీ కూడా పాల్గొన్నారు. షూటింగ్ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రియాంక ఈ ఫ్యామిలీ టైమ్‌ను ఇలా స్పెండ్ చేసారు. కేవలం గ్లామర్ ఫోటోలకే పరిమితం కాకుండా భర్త.. చిన్నారి మాల్తీతో కలిసి నీళ్లలో ఆడుకుంటున్న క్షణాలు ప్రేక్షకులకు ఒక అందమైన ఫ్యామిలీ వైబ్‌ను అందించాయి.



# భాగ్యశ్రీ బిస్తర్ చెన్నైకి!

యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే తమిళ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అయిందంటూ గత కొద్ది రోజులుగా వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇండస్ట్రీ ఎంట్రీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్న ఇప్పటివరకు ఈ అమ్మడుకు సరైన హిట్ రాకపోవడంతో.. కోలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు అడుగులు వేస్తుందని వార్తలు వచ్చాయి. తమిళ స్టార్ హీరో శివకార్తికేయన్, దర్శకుడు శివకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'సెయాన్'. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ మూవీని కమల్ హాసన్ తన బ్యానర్‌పై నిర్మిస్తుండటంతో ప్రేక్షకుల్లో హై ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి. అయితే.. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించనున్నట్లు నెట్టింట ప్రచారం జరిగింది. దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రానప్పటికీ.. ఇది భాగ్యశ్రీకి మంచి ఆఫర్ అని అభిప్రాయం వ్యక్తం చేశారు అభిమానులు. అయితే.. ఈ వార్తలపై ఇన్‌డైరెక్ట్ హింట్ ఇచ్చేసింది ఈ యంగ్ హీరోయిన్. ఈ మేరకు తాజాగా తన ఇన్‌స్టావేదికగా ఓ స్టోరీ పోస్ట్ చేసింది. అందులో.. శివకార్తీకేయన్ 'అమరన్' సాంగ్ పెట్టుకుని 'వనక్కం చెన్నై' అనే క్యాప్షన్ జత చేసింది.



# వెంటనే వైభవ్‌ను టీమిండియాలోకి తీసుకోవాలి

## భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్

'గత ఏడాది బుమ్రా బౌలింగ్‌లో ఔటయ్యాను. ఈసారి అతడి బౌలింగ్‌లో పరుగులు చేయాలి'.. ఇది ఐపీఎల్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పెట్టుకున్న లక్ష్యం. చెప్పడమే కాదు, మంగళవారం రాత్రి ముంబై ఇండియన్స్ తో జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ స్థాయి బౌలర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో దూకుడుగా ఆడి దాన్ని చేసి చూపించాడు.

**ఈ అద్భుత ప్రదర్శనపై భారత మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ ప్రశంసల వర్షం కురిపించాడు. వైభవ్ ప్రదర్శనపై స్పందించిన ఇర్ఫాన్, అతడిని వెంటనే జాతీయ జట్టులోకి తీసుకోవాలని బీసీసీఐకి సూచించాడు. "వైభవ్ ఒక యువ సంచలనం.**

15 ఏళ్ల వయసులో వైట్ బాల్ క్రికెట్‌లో ఇంతటి పరిణతితో కూడిన ప్రదర్శన అసాధారణం. బుమ్రా బౌలింగ్‌ను ఎదుర్కోవడం చాలా కష్టం. అలాంటిది, అతడిపై పరుగులు చేస్తానని చెప్పి, చేసి చూపించాడు. తన లక్ష్యాన్ని చేరుకున్నాడు" అని ఇర్ఫాన్ కొనియాడాడు. "ఈ కుర్రాడిని ఎక్కువ కాలం వేచి చూసేలా చేయొద్దు. ఇప్పుడే జాతీయ జట్టులోకి తీసుకుంటే, అతడు సుమారు 20 ఏళ్ల పాటు దేశానికి సేవలందించగలడు" అని ఇర్ఫాన్ అభిప్రాయపడ్డాడు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లోనే 39 పరుగులు బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో అగ్రశ్రేణి బౌలర్లను సైతం ఎదుర్కొని నిలకడగా రాణిస్తుండటంతో, ఇర్ఫాన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

### బుమ్రాలోనూ భయం పుట్టించాడు: డేల్ స్టెయిన్

రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తన దూకుడైన బ్యాటింగ్‌తో బౌలర్లపై మానసికంగా ఆధిపత్యం చెలాయిస్తున్నాడని, చివరికి జస్ప్రీత్ బుమ్రా లాంటి మేటి బౌలర్లను కూడా తప్పిదాలు చేసేలా ఒత్తిడికి గురిచేస్తున్నాడని దక్షిణాఫ్రికా మాజీ దిగ్గజ పేసర్ డేల్ స్టెయిన్ ప్రశంసించాడు. సూర్యవంశీ బౌలర్ల గుండెల్లో భయాన్ని నింపుతున్నాడని ఆయన అభిప్రాయపడ్డాడు. మంగళవారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బుమ్రా వేసిన తొలి బంతినే సూర్యవంశీ మిడ్-ఆన్ మీదుగా బౌండరీ తరలించిన విషయాన్ని స్టెయిన్ గుర్తుచేశాడు. "బుమ్రా వేసిన ఆ బంతి స్లాట్‌లో పడింది. బుమ్రా నుంచి ఇలాంటి బంతి రావడం చాలా అరుదు. 'తప్పు చేస్తే సిక్స్ కొడతాడు' అని బుమ్రా మదిలో కూడా మెదిలి ఉంటుంది. అలా అనుకున్నప్పుడు చాలాసార్లు పొరపాట్లు జరుగుతాయి. సరిగ్గా అదే జరిగింది," అని స్టెయిన్ వివరించాడు. సూర్యవంశీకి భయం లేదని, ఎదురుగా ఉన్న బౌలర్ ఎవరైనా సరే, చెత్త బంతి వేస్తే శిక్షించడం ఖాయమని స్టెయిన్ అన్నాడు. "ఆ కుర్రాడికి భయమంటే తెలియదు. బౌలర్ బుమ్రా అయినా, సాధారణ బౌలర్ అయినా సరే.. బంతి మిస్ అయితే బౌండరీ దాటాల్సిందే. ఇది అద్భుతమైన బ్యాటింగ్" అని కొనియాడాడు.

## మళ్లీ కలిసిన స్మృతి మందాన-పలాశ్

భారత లేడీ కోహ్లీ స్మృతి మందాన యూటర్న్ తీసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. పలాశ్ ముచ్చల్ తో ఏడడుగులు నడిచేందుకు స్మృతి మందాన నిర్ణయం తీసుకున్నట్లు నేషనల్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ జంట పెళ్లి, పీటలపైనే ఆగిపోయింది. స్మృతి మందాన తండ్రికి గుండెపోటు వచ్చిందని అర్ధాంతరంగా పీటలపైన పెళ్లి ఆపేశారు. ఆ తర్వాత వీళ్ళ పెళ్లి క్యాన్సిల్ కావడానికి అనేక కారణాలు ఉన్నాయని వార్తలు వైరల్ అయ్యాయి. పలాశ్ ముచ్చల్ మరో అమ్మాయితో పెళ్లి కంటే ఒక్కరోజు ముందు దొరికిపోయాడని వార్తలు కూడా వచ్చాయి. మొత్తానికి ఈ ఇద్దరు విడిపోయి ఎవరి లైఫ్ వాళ్ళు గడిపేస్తున్నారు. అయితే ఈ నేపథ్యంలో తాజాగా పలాశ్ చెల్లెలితో స్మృతి మందాన తండ్రి కనిపించాడు. దీంతో స్మృతి మందాన, పలాశ్ మధ్య గొడవ సద్దుమణిగిందని, త్వరలో ఈ ఇద్దరు పెళ్లి చేసుకోబోతున్నట్లు వార్తలు వైరల్ చేస్తున్నారు. పలాశ్ పైన కోపాన్ని తగ్గించుకున్న స్మృతి, తన తండ్రిని రంగంలోకి దింపినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగానే పలాశ్ ఇంటికి వెళ్లి పెళ్లి గురించి స్మృతి మందాన తండ్రి మాట్లాడినట్లు చెబుతున్నారు.





## వాంఖడేలో ఓ స్టాండ్‌కు రవిశాస్త్రి పేరు

భారత క్రికెట్ దిగ్గజం, టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రికి ముంబై క్రికెట్ అసోసియేషన్ అరుదైన గౌరవాన్ని ప్రకటించింది. ముంబైలోని ఐకానిక్ వాంఖడే స్టేడియంలోని ఒక స్టాండ్‌కు ఆయన పేరు పెట్టాలని నిర్ణయించింది. వాంఖడే స్టేడియంలోని ప్రెస్ బాక్స్ కింద ఉన్న లెవల్ 1 స్టాండ్‌కు 'రవిశాస్త్రి స్టాండ్' అని పేరు పెట్టనున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఆటగాడిగా, కెప్టెన్‌గా, కోచ్‌గా, వ్యాఖ్యాతగా ఆయన అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా ఎంసీఏ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ వేడుకలో రవిశాస్త్రితో పాటు ముంబైకి చెందిన మరికొందరు క్రికెట్ దిగ్గజాల పేర్లను స్టేడియం గేట్లకు పెట్టనున్నారు. మహిళా క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ డయానా ఎడుల్జీ పేరును గేట్ నంబర్ 5కు పెట్టనున్నారు. దివంగత బ్యాటింగ్ దిగ్గజం దిలీప్ సర్దేశాయ్ పేరును గేట్ నంబర్ 3కి కేటాయించారు. అద్భుతమైన ఫీల్డర్‌గా పేరుగాంచిన ఏకనాథ్ సోల్కర్ గౌరవార్థం గేట్ నంబర్ 6కు ఆయన పేరు పెట్టనున్నారు. రేపు నిర్వహించే ఈ భారీ ఆవిష్కరణ కార్యక్రమానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్య అతిథిగా హాజరై... ఈ స్టాండ్, గేట్లను అధికారికంగా ప్రారంభిస్తారు. ఎంసీఏ అధ్యక్షుడు అజింక్య నాయక్ ఆధ్వర్యంలో ఈ వేడుక జరగనుంది. రవిశాస్త్రి ముంబై తరఫున ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఒకే ఓవర్‌లో 6 సిక్సర్లు కొట్టిన రికార్డుతో పాటు, 1983 ప్రపంచకప్ విజేత జట్టులో సభ్యుడిగా కూడా ఉన్నారు. తన కెరీర్‌లో 80 టెస్టులు, 150 వన్డేలు ఆడి దాదాపు 7 వేల పరుగులు, 280 వికెట్లు తీశాడు.

## హాకీ జట్టులోకి స్టార్స్ రీ ఎంట్రీ

**అర్జెంటీనాతో సిరీస్‌కు వుమెన్ టీం టంపిక**

ఏప్రిల్ 13-17 వరకు అర్జెంటీనాలో జరుగబోయే నాలుగు మ్యాచ్‌ల సిరీస్ కోసం 24 మంది సభ్యుల భారత మహిళల హాకీ జట్టును హాకీ ఇండియా ఇవాళ (ఏప్రిల్ 8) ప్రకటించింది. స్టార్ ప్లేయర్లు సవితా పూనియా (గోల్ కీపర్), దీపిక (ఫార్వర్డ్) ఈ సిరీస్‌తో రీఎంట్రీ ఇచ్చారు. సలీమా టేటే కెప్టెన్‌గా కొనసాగుతారు. జ్యోతి, ముంతాజ్ ఖాన్ జట్టులోకి తిరిగి వచ్చారు. రుతుజా, ఇషికా, సాక్షి రాణా వంటి యువ ప్లేయర్లకు కూడా ఈ జట్టులో చోటు దక్కింది. సవితతో పాటు మరో గోల్ కీపర్‌గా బిచు దేవి ఎంపికయ్యారు. డిఫెండర్లుగా నిక్కీ ప్రధాన్, ఇషికా చౌధరి, సుశీలా చాను, మనీషా చౌహాన్, లల్తంత్లుయాంగి, జ్యోతి, ఉదితా చోటు దక్కించుకున్నారు. మిడ్‌ఫీల్డర్లుగా వైష్ణవి విఠల్ ఫల్కే, సాక్షి రాణా, సునెలితా టోప్పో, సలీమా టేటే, నేహా, దీపికా సోరెంగ్, రుతుజా దాదాసో పిసాల్, ఇషికా .. ఫార్వర్డ్ ప్లేయర్లుగా బల్జీత్ కౌర్, నవనీత్ కౌర్, దీపికా, అన్ను, బ్యూటీ డుంగ్‌డుంగ్, లాల్‌రెమ్సియామి, ముంతాజ్ ఖాన్ వ్యవహరించనున్నారు.



## 16 మందికే గ్రౌండ్‌లోకి అనుమతి

**ఐపీఎల్‌లో బీసీసీఐ కొత్త రూల్**

ఐపీఎల్ క్రికెటర్లకు బిగ్ అలర్ట్. ఐపీఎల్ జట్లలో బెంచ్ కు పరిమితం అయిన ఆటగాళ్లకు కొత్త రూల్స్ అమలు చేయబోతోంది భారత క్రికెట్ నియంత్రణ మండలి. ఇకపై టీం షీట్ లోని 16 మందికే గ్రౌండ్ లోకి అనుమతి ఉంటుందని అధికారిక ప్రకటన చేసింది. మిగిలిన ప్లేయర్లు ఎవరూ కూడా గ్రౌండ్ లో అడుగు పెట్టకూడదని వెల్లడించింది. 16 మంది తప్ప మిగిలిన ప్లేయర్లు డ్రింక్స్, బ్యాట్లు, సందేశాలు తీసుకురాకూడదని ఆదేశాలు జారీ చేసింది బీసీసీఐ. బౌండరీ చుట్టూ ఐదుగురు కంటే ఎక్కువ మంది బెంచ్ ప్లేయర్లు ఉండకూడదని స్పష్టం చేసింది. ఎల్ఈడీ యాడ్ బోర్డులు, బౌండరీ లైన్ మధ్య తిరగడానికి వీలులేదని పేర్కొంది భారత క్రికెట్ నియంత్రణ మండలి. ఈ రూల్స్ ఎవరైనా బ్రేక్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. అటు ఇప్పటికే స్లీవ్ లెస్ జెర్సీలతో గ్రౌండ్ లోకి రాకూడదని ఇప్పటికే బీసీసీఐ పేర్కొన్న సంగతి తెలిసిందే. అలాగే కుటుంబ సభ్యులు, భార్యలను డ్రెస్సింగ్ రూమ్స్ లోకి తీసుకురాకూడదు. సొంత వాహనాల్లో హోటల్స్ నుంచి స్టేడియాలకు రాకూడదని వెల్లడించింది బీసీసీఐ.

## ఆయుశ్.. అదరహో!

**భారత షట్లర్ సంచలనం.. వరల్డ్ నం.7కు షాక్**

చైనాలో జరుగుతున్న ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బ్యాడ్మింటన్ ప్లేయర్ ఆయుశ్ సంచలనం సృష్టించాడు. బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో అద్భుత విజయం సాధించాడు. వరల్డ్ నం.7 ఆటగాడు లి షి ఫెంగ్‌ను మట్టికరిపించాడు. 51 నిమిషాలు సాగిన మ్యాచ్‌లో ఆయుశ్ 21-13, 21-16 తేడాతో గెలుపొందాడు. తొలి రౌండ్‌లో కఠిన ప్రత్యర్థి ఎదురైనా ఆయుశ్ ఏ మాత్రం ఒత్తిడికి గురికాలేదు. తన కంటే మెరుగైన ర్యాంకర్ అయిన ఫెంగ్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. తొలి గేము అలవోకగా నెగ్గగా.. రెండో గేములో మాత్రం కాస్త ప్రతిఘటన ఎదుర్కొన్నాడు. ఒక దశలో 12-9తో వెనుకబడ్డాడు. కానీ, అక్కడి నుంచి



పుంజుకుని ప్రత్యర్థికి మరో చాన్స్ ఇవ్వలేదు. మరో భారత ఆటగాడు హెచ్.ఎస్ ప్రణయ్ కూడా రెండో రౌండ్‌లో అడుగుపెట్టాడు. తొలి మ్యాచ్‌లో ప్రణయ్ 24-22, 21-12 తేడాతో వియత్నంకు చెందిన హోయ్ డాంగ్‌పై విజయం సాధించాడు. అటు.. భారత స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో మలేసియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌పై విక్టరీ నమోదు చేసింది. అయితే, తొలి రౌండ్‌ను ప్రత్యర్థి 21-15తో నెగ్గడంతో ఆరంభంలో సింధుకు షాక్ తగిలింది. కానీ, ఆ తర్వాత తన సత్తా చూపించింది. వరుసగా రెండు సెట్లను 21-11, 21-19తో గెలిచి మ్యాచ్‌ను సొంతం చేసుకుంది. యువ షట్లర్లు తన్వి శర్మ, మాళవిక బాన్సోద్‌లకు నిరాశ తప్పలేదు. తొలి రౌండ్‌లోనే ఓడి ఇంటిదారిపట్టారు. కాగా, ఆసియా చాంపియన్‌షిప్‌లో తొలి రోజే భారత్‌కు భారీ షాక్‌లు తగిలాయి. పతకం సాధిస్తాడనుకున్న లక్ష్యసేన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించడం గమనార్హం. హాంకాంగ్ ప్లేయర్ లీ చెయుక్ యియు చేతిలో 21-12, 21-19 తేడాతో సేన్ పరాజయం పాలయ్యాడు.



## ఒక్క పరుగు..!

**గెలిచిన గుజరాత్**

**ఓడిన ఢిల్లీ క్యాపిటల్స్**

ఐపీఎల్ 2026లో మరో ఉత్కంఠభరిత మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ పోరులో గుజరాత్ టైటాన్స్ కేవలం ఒక్క పరుగు తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై థ్రిల్లింగ్ విజయం సాధించింది. చివరి ఓవర్‌లో ఢిల్లీ విజయానికి 13 పరుగులు అవసరమైన దశలో, బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేసి గుజరాత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. చివరి ఓవర్ తొలి బంతికే విప్రాజ్ నిగమ్ ఫోర్ కొట్టడంతో ఢిల్లీ గెలుపు ఖాయమనిపించింది. కానీ, తర్వాతి బంతికే నిగమ్‌ను ఔట్ చేసిన ప్రసిద్ధ్, మ్యాచ్‌ను గుజరాత్ వైపు తిప్పాడు. నాలుగో బంతిని డేవిడ్ మిల్లర్ సిక్సర్‌గా మలచడంతో సమీకరణం 2 బంతుల్లో 2 పరుగులుగా మారింది. ఐదో బంతికి పరుగు రాకపోవడంతో ఉత్కంఠ తారాస్థాయికి చేరింది. చివరి బంతికి 2



పరుగులు అవసరం కాగా, మిల్లర్ షాట్ మిస్ అవ్వగా.. పరుగు కోసం ప్రయత్నించిన కుల్దీప్ రనౌట్ కావడంతో గుజరాత్ సంబరాల్లో మునిగిపోయింది. 211 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ చివరి వరకు పోరాడింది. కేఎల్ రాహుల్ (52 బంతుల్లో 92) అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును గెలుపు అంచుల వరకు తెచ్చాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (20 బంతుల్లో 41) మెరుపులు మెరిపించినా ఫలితం లేకపోయింది. గుజరాత్ బౌలర్లలో రషీద్ ఖాన్ 17 పరుగులిచ్చి 3 వికెట్లతో ఢిల్లీని దెబ్బకొట్టాడు. అంతకుముందు, గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 210 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (70), జోస్ బట్లర్ (52), వాషింగ్టన్ సుందర్ (55) అర్ధ సెంచరీలతో జట్టుకు భారీ స్కోరు అందించారు.



ఈవార్తలు
# ప్రజావాణి
గురువారం 9-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# విజయ 'శాంతి'

అగ్గికి ఆజ్యం పోస్తే అది ఊరువాడ అంతా దహించివేస్తుంది. కానీ, సంయమనం అనే నీరు ఆ మంటలను ఆర్పగలదు. ప్రపంచాన్ని యుద్ధ భయంతో వణికించిన ఉద్రిక్తతలకు తెరదించుతూ, ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందానికి రావడం అంతర్జాతీయ సమాజానికి ఊరటనిచ్చే పరిణామం. ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన విషయం ఇరాన్ తన నియంత్రణలో ఉన్న 'హోర్ముజ్ జలసంధి'ని తిరిగి తెరవడానికి అంగీకరించడం. ప్రపంచ చమురు రవాణాలో 20% వాటా కలిగిన ఈ మార్గం దిగ్బంధనం, ప్రపంచ ఇంధన ధరలను ఆకాశానికి చేర్చింది. ఇప్పుడు ఆ అడ్డంకి తొలగడం సామాన్యుడికి కూడా కొంత ఊరటనిచ్చే అంశం. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధినాయకత్వం 'యుద్ధం' అనే ఆఖరి అస్త్రాన్ని పక్కనబెట్టి, చర్చలకు మొగ్గుచూపడం హర్షణీయం. పాకిస్థాన్, చైనా వంటి దేశాల మధ్యవర్తిత్వం ఈ శాంతి ప్రయత్నాలకు బాటలు వేయడం గమనించదగ్గ విషయం. మొండితనం వినాశనానికి దారితీస్తే, మాటల మార్పిడి పరిష్కారానికి నాంది పలుకుతుంది అన్న సూత్రం ఇక్కడ మరోసారి రుజువైంది. ఇది కేవలం ఆరంభం మాత్రమే. రెండు వారాల ఈ విరామం శాశ్వత శాంతి ఒప్పందంగా మారాలంటే ఇరు పక్షాలూ చిత్తశుద్ధితో ముందుకు సాగాలి. బాంబుల మోత కన్నా చర్చల స్వరం మిన్న అని తాజా నిర్ణయం మరోసారి నిరూపించింది. గత కొంతకాలంగా పశ్చిమ ఆసియాలో నెలకొన్న అనిశ్చితి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, ముఖ్యంగా సామాన్యుడిని భయపెట్టింది. చమురు ధరలు ఆకాశాన్నంటడం నుండి రవాణా వ్యవస్థ స్తంభించడం వరకు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. అయితే, మొండితనాన్ని వీడి దౌత్య మార్గాన్ని ఎంచుకోవడం ద్వారా అగ్రరాజ్యం అమెరికా, ప్రాంతీయ శక్తి ఇరాన్ పరిణతిని ప్రదర్శించాయి. యుద్ధం వల్ల కలిగే లాభం కంటే, శాంతి వల్ల చేకూరే ప్రయోజనాలే ఎక్కువని ఇరు పక్షాలు గుర్తించడం హర్షణీయం. యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో కాల్పులు కాదు, వేల సంఖ్యలో అమాయక ప్రాణాలు బలవ్వడం. పిల్లలు అనాథలవ్వడం, తల్లుల ఆక్రందనలు, తరాల పాటు మాయని గాయాలు. ఇప్పుడు కుదిరిన ఈ ఒప్పందం ఆ విధ్వంసానికి అడ్డుకట్ట వేసింది. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా, చర్చల టేబుల్ మీద సమస్యలను పరిష్కరించుకోవచ్చనే నమ్మకాన్ని ఇది ప్రపంచానికి ఇచ్చింది. యుద్ధం ఎవరు సరైనవారో నిర్ణయించదు.. ఎవరు మిగిలారో మాత్రమే నిర్ణయిస్తుంది. ఈ వాస్తవాన్ని గ్రహించిన ఇరు దేశాలు శాంతికి పట్టం కట్టడం అభినందనీయం. ఈ తాత్కాలిక సీజ్‌ఫైర్ శాశ్వత శాంతికి పునాది కావాలని ప్రపంచం కోరుకుంటోంది. ఆయుధాలు మౌనం వహించి, అభివృద్ధికి అడుగులు పడటం ద్వారానే నిజమైన 'శాంతి' విజయం పూర్తవుతుంది. ఆంక్షల ఎత్తివేత, అణు ఒప్పందాలపై స్పష్టత వంటి క్లిష్టమైన అంశాలను పరిష్కరించుకోవాలి. అప్పుడే ఈ 'తాత్కాలిక విజయం' తరాల పాటు నిలిచిపోయే 'చరిత్ర' అవుతుంది.




# పబ్లిసిటీ స్టంట్లు



రామస్వామి
అచ్చంపేట

తెలుగు రాష్ట్రాల రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు సరికొత్త మలుపు తిరిగింది. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు పట్టాల మీద సాగాల్సిన పాలన.. ఫొటో షూట్లు, సోషల్ మీడియా ట్రెండ్లు, ఈవెంట్ మేనేజ్‌మెంట్ చుట్టూ తిరుగుతోంది. ప్రజల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వాలు, వారికి ఇచ్చిన హామీలను అమలు చేయడం కంటే, తాము ఏం చేస్తున్నామో రంగులద్దిన ప్రచార చిత్రాల ద్వారా చూపించడానికే ఎక్కువ సమయం, శ్రమ కేటాయిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చాక, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం, అమరావతి నిర్మాణం వంటి అంశాలపై దృష్టి పెట్టింది. అయితే, ప్రతీ చిన్న విషయాన్ని ఒక ఈవెంట్‌లా మార్చడం, గత ప్రభుత్వ వైఫల్యాలనే పదే పదే ఎత్తిచూపుతూ కాలయాపన చేయడంపై విమర్శలు వస్తున్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పుడు, ఆర్భాటపు ప్రకటనల కంటే ఆచరణాత్మకమైన అడుగులు అవసరం. సూపర్ సిక్స్ హామీల అమలులో స్పష్టత కంటే, సోషల్ మీడియాలో హడావుడి ఎక్కువగా కనిపిస్తోందన్నది సామాన్యుడి ఆవేదన. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన అంటూ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. సచివాలయ ద్వారాలు తెరిచారు, ప్రజా భవన్ ద్వారా అర్జీలు తీసుకుంటున్నారు. ఇవన్నీ మంచి పరిణామాలే అయినా, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలు తీరుతున్నాయా అన్నది ప్రశ్నార్థకం. హైడ్రా వంటి నిర్ణయాలు సంచలనం సృష్టించినా, అవి పేదల ఇళ్ల కూల్చివేతలకు దారితీస్తున్నాయన్న విమర్శలు ప్రభుత్వ ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తున్నాయి. పాలనలో దూకుడు కంటే, ప్రచారంలో ఉన్న వేగం అభివృద్ధి పనుల్లో కనిపించడం లేదన్నది నిజం. రాజకీయ నాయకులు ప్రజల మధ్య ఉండటం తప్పు కాదు, కానీ అది కేవలం కెమెరాల ముందు ప్రదర్శనగా మారడమే అసలు సమస్య. రెండు రాష్ట్రాలు అప్పుల ఊబిలో ఉన్నాయి. ఇలాంటి సమయంలో ప్రజా ధనాన్ని ప్రచార కార్యక్రమాలకు, పీఆర్ ఏజెన్సీలకు భారీగా కేటాయించడం సమంజసం కాదు. ముఖ్యమంత్రుల మెప్పు పొందడం కోసం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా అభివృద్ధి పనుల కంటే 'సోషల్ మీడియా మేనేజ్‌మెంట్' మీద దృష్టి పెడుతున్నారు. నిరుద్యోగం, పెరుగుతున్న ధరలు, రోడ్ల దుస్థితి వంటి మౌలిక సమస్యల కంటే రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలే మీడియాలో హైలైట్ అవుతున్నాయి. ప్రజలు కోరుకునేది పీఆర్ స్టంట్లు కాదు, వారి జీవితాల్లో మార్పు తెచ్చే పాలన. ప్రభుత్వాలు ఎన్ని షోలు చేసినా, ఎన్నికల సమయంలో ప్రజలు ఇచ్చే తీర్పు వారి అనుభవంలోకి వచ్చిన అభివృద్ధి మీదే ఆధారపడి ఉంటుంది. చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఇద్దరూ తమ అనుభవాన్ని, ఉత్సాహాన్ని కేవలం ప్రచారానికే పరిమితం చేయకుండా, వ్యవస్థాగతమైన మార్పుల వైపు మళ్ళించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేదంటే, ఈ 'షో'లు తాత్కాలికంగా ఆకర్షించినా, దీర్ఘకాలంలో విశ్వసనీయతను దెబ్బతీస్తాయి.


# ప్రజల కష్టాలు పట్టవా?

తెలంగాణలో 'ప్రజా పాలన' పేరుతో గద్దెనెక్కిన రేవంత్ సర్కార్, ఆచరణలో మాత్రం ఆర్భాటాలకే పరిమితమవుతోంది. ప్రచారాల కోసం వేల కోట్లు కుమ్మరిస్తున్న ప్రభుత్వం, సామాన్యుడి కష్టాలను పట్టించుకోవడంలో వెనుకబడుతోంది. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారానికి, పత్రికా ప్రకటనలకు, హోర్డింగులకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తోంది. అయితే, ఇదే ఉత్సాహం ప్రజా సంక్షేమ పథకాల అమలులో కనిపించడం లేదు. మహాలక్ష్మి, రైతు భరోసా వంటి కీలక హామీలు నేటికీ పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు అందడం లేదని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా సింగరేణి సంస్థ నిధులను ఫుట్‌బాల్ వంటి క్రీడా ఈవెంట్లకు మళ్లించడంపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.



నవీన్ పోగుల
బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు

కార్మికుల రక్తాన్ని చెమటగా మార్చి సంపాదించిన లాభాలను, వారి ప్రయోజనాల కోసం కాకుండా ప్రచార కార్యక్రమాలకు వాడటం శోచనీయం. డిసెంబర్ 2025లో జరిగిన లియోనెల్ మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్ కోసం ప్రభుత్వం ఏకంగా రూ. 100 కోట్లు వెచ్చించిందనే ఆరోపణలు ఉన్నాయి. అందులోనూ, కష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థ నుండి రూ. 10 కోట్లు "స్పోర్ట్స్ స్పాన్సర్‌షిప్" పేరుతో తీసుకోవడం గమనార్హం. కేవలం క్రీడలే కాదు, గతేడాది జరిగిన 'మిస్ వరల్డ్' పోటీల ప్రచారానికే ప్రభుత్వం దాదాపు రూ. 5.70 కోట్లు ఖర్చు చేసినట్లు ఆర్టీఐ ద్వారా వెల్లడైంది. పేదలకు ఇళ్లు, పెన్షన్ల కోసం నిధులు లేవని చెప్పే ప్రభుత్వం.. ఇలాంటి 'బ్రాండింగ్' ఈవెంట్లకు మాత్రం కోట్ల రూపాయలు తగలబెట్టడం ఎంతవరకు సమంజసం? ప్రభుత్వం ఇప్పటివరకు రూ. 61,000 కోట్లు సంక్షేమం కోసం ఖర్చు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరుగా ఉంది. పెట్టుబడి సాయం ఎప్పుడు పడుతుందో తెలియక రైతులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. రూ. 2 లక్షల రుణమాఫీ అందరికీ వర్తింపజేయడంలో ప్రభుత్వం విఫలమైంది. కొర్రీల పేరుతో అనేకమంది రైతులను లబ్ధిదారుల జాబితా నుండి తొలగించారన్నది ప్రధాన ఆరోపణ. ఒకవైపు ఉద్యోగులు జీతాల పెంపు కోసం, పాత బకాయిల కోసం ఎదురుచూస్తుంటే.. ప్రభుత్వం మాత్రం ప్రాధాన్యతలను విస్మరించి నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం వారి ఆకాంక్షలను దెబ్బతీయడమే. నిరుద్యోగ భృతి, కొత్త నోటిఫికేషన్ల భర్తీ విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యం యువతలో అసహనాన్ని నింపుతోంది. పేదలకు అందాల్సిన రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. పాలన అంటే కేవలం పబ్లిసిటీ స్టంట్లు కాదని, క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాలను తీర్చడమని ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు గుర్తు చేస్తున్నాయి. ప్రజలు కోరుకుంటున్నది సినిమా స్టైల్ పబ్లిసిటీ కాదు.. తమ బతుకులు మార్చే పరిపాలన. సింగరేణి కార్మికుల కష్టాన్ని విలాసాలకు వాడటం మానేసి, ఇప్పటికైనా విద్య, వైద్యం, వ్యవసాయం వంటి ప్రాధాన్యత రంగాలపై దృష్టి సారించాలి. లేదంటే, ఈ ప్రచార ఆర్భాటాలే ప్రభుత్వానికి గుదిబండగా మారే ప్రమాదం ఉంది. ఓట్ల కోసం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, కేవలం ప్రచార చిత్రాలతో కాలం వెళ్లదీయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఇప్పటికైనా రేవంత్ సర్కార్ ప్రచార వ్యామోహం వీడి, సింగరేణి కార్మికుల సమస్యలు, పేదల సంక్షేమంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.